


పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 13 సంచిక : 86 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 28 నవంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :86 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : VISAKHAPATNAM SAT 28 NOVEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

అమెరికాను ముంచెత్తిన వరదలు, మంచు తుపాను

పలు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ



పెన్ పవర్ డెస్క్:అమెరికాలో అత్యంత ఘనంగా జరుపుకు నే 'థాంక్స్ గివింగ్' పండుగ వేళ ప్రకృతి తీవ్ర ప్రకోపం చూపించింది. భారీ వర్షాలు,

- మిగతా 2లో

నేను ఇక్కడే ఉన్నా.. దమ్ముంటే పట్టుకోండి

పోలీసులకు అభిజిత్ దీప్కే సవాల్

- పోలీసుల లుకౌట్ నోటీసులపై బహిరంగంగా స్పందించిన సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే
- నాగ్‌పూర్ నిరసన సభలో పోలీసులకు అరెస్ట్ సవాల్ విసిరిన వైనం
- కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపణ



- మిగతా 2లో

హసీనా ఓ 'ముల్లు'లా మారారు - బంగ్లాదేశ్



పెన్ పవర్ డెస్క్:భారత్–బంగ్లాదేశ్ సంబంధాల్లో మాజీ ప్రధాని షేక్ హసీనా ఓ 'ముల్లు'లా మారారని బంగ్లాదేశ్ పేర్కొంది. ఆమెకు ఆశ్రయం ఇవ్వడం ద్వైపాక్షిక సంబంధాలపై ఒత్తిడి పెంచుతోందని భారత్ ఇప్పుడిప్పుడే తెలుసుకుంటోందని వ్యాఖ్యానించింది. ఆమెను బయటకు పంపించలేక, ఆశ్రయం కల్పించడాన్ని సమర్థించుకోలేక భారత్ ఇబ్బందులు పడుతోందని పేర్కొంది. డిసెంబర్ 16న హసీనా

- మిగతా 2లో

కోట్ల విలువైన భూముల వ్యవహారాలపై అనుమానాలు..

పెందుర్తి మండల పరిధిలో కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు సంబంధించి వివిధ లావాదేవీలు, రికార్డుల మార్పులు, భూ ఆక్రమణల ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, రెవెన్యూ కార్యాలయంలో కీలక బాధ్యతల మార్పు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. కొన్ని భూ వ్యవహారాల్లో సంబంధిత రికార్డులు, ఫైళ్ల నిర్వహణ, క్షేత్రస్థాయి నివేదికలు కీలకంగా ఉండే సమయంలో, బాధ్యతల మార్పు వల్ల ఎవరికైనా అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయా? భూ ఆక్రమణదారులకు ప్రయోజనం చేకూరేలా ఏమైనా చర్యలు జరుగుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలని స్థానికంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. కోట్ల విలువైన భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు లేదా అనధికార లావాదేవీలకు మార్గం సుగమం చేసేందుకు ఈ మార్పులు ఉపయోగపడుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, వాటిని నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడికాలేదు. అందువల్ల ఈ అంశాలన్నింటినీ ఉన్నతాధికారులు రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.



పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో 'పోస్టుల గారడీ'!


కోట్ల విలువైన భూముల వ్యవహారాల కోసమే బాధ్యతల మార్పా?



- ఆర్ఐని పక్కకు తప్పించి.. సీనియర్ అసిస్టెంట్‌కు కీలక బాధ్యతలు!
- తహశీల్దార్ నిర్ణయంపై రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చ
- ఆర్డీవో, జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ చేపట్టాలి

పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 25 : స్థానిక పెందుర్తి మండల తహశీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఉద్యోగుల బాధ్యతల మార్పు వ్యవహారం ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పరిపాలనా సౌలభ్యం పేరుతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), సీనియర్ అసిస్టెంట్ పోస్టుల మధ్య చేపట్టిన పరస్పర ఇన్‌చార్జ్ నియామకాల వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు సంబంధించిన లావాదేవీలు, రెవెన్యూ రికార్డుల వ్యవహారాలు ఈ మార్పులతో ముడిపడి ఉన్నాయా? అన్న అనుమానాలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్‌సీ నంబర్ 1/2026/జ, తేదీ 12-11-2026తో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. భార్గవ్ వెంకటేష్‌ను సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఇన్‌చార్జిగా, సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న జె. లోకేష్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఇన్‌చార్జిగా నియమించారు. కార్యాలయ పరిపాలనా సౌలభ్యం, అధికారిక విధుల సమర్థవంతమైన నిర్వహణ, పనుల సక్రమ పంపిణీ కోసం ఈ మార్పులు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఏర్పాటు పూర్తిగా తాత్కాలికమని, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

- మిగతా 2లో



Rc.No. ఎ | /2026/C, Dt.12-11-2026 O/o the Tahsildar,Pendurthi Mandal.

PROCEEDINGS OF THE TAHSILDAR, PENDURTHI MANDAL
PRESENT: SRI I. VENKATA APPARAO

Sub:- Public Services –Visakhapatnam District & Division – Pendurthi Mandal – Reciprocal Incharge arrangements – Sri J.Lokesh,Senior Assistant,O/o Tahsildar Pendurthi is kept incharge of the post of Mandal Revenue Inspector ,Pendurthi and Sri S.Bhargav Venkatesh, Mandal Revenue Inspector, O/o Tahsildar Pendurthi is kept incharge of the Post of Senior Assistant, O/o Tahsildar Pendurthi for administrative convenience and efficient functioning of the office – Orders issued – Regarding.

Read:- Administrative exigencies.

&&&

ORDER:

In view of the administrative exigencies and in order to ensure smooth functioning of the office administration, effective discharge of official duties and proper distribution of work, it has been considered necessary to interchange the responsibilities of the Revenue Inspector and Senior Assistant in this Mandal.

In view of the above, **Sri S.Bhargav Venkatesh, Mandal Revenue Inspector**, is hereby kept in-charge of the post of Senior Assistant, and **Sri J.Lokesh, Senior Assistant**, is hereby kept in-charge of the post of Revenue Inspector, with immediate effect.

The individuals concerned shall discharge the duties and responsibilities attached to their respective in-charge assignments, ensuring that the day-to-day administration of the office is carried out smoothly and efficiently.

The above arrangement is purely temporary and is made in the interest of administrative convenience and efficient administration, until further orders.

The individuals concerned are hereby instructed to assume the respective in-charge responsibilities with immediate effect and ensure proper handing over and taking over of the concerned records, files and other official responsibilities.

Pendurthi Tahsildar

To:
Sri S.Bhargav Venkatesh, Revenue Inspector, O/o Tahsildar,Pendurthi Mandal
Sri J.Lokesh, Senior Assistant, O/o Tahsildar,Pendurthi Mandal



డీలిమిటేషన్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం!

అన్ని రాష్ట్రాల్లో 50 శాతం లోక్‌సభ సీట్లు పెంపు

- మహిళా రిజర్వేషన్ల అమలుకు కొత్త ప్రతిపాదన
- లోక్‌సభ స్థానాలు 815కు పెంపు!
- ఏపీకి 38, తెలంగాణకు 26 ఎంపీ సీట్లు..
- రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య నిష్పత్తి 2051 వరకు కొనసాగింపు..
- నవంబర్ 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసే డీలిమిటేషన్ ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను 50 శాతం చొప్పున పెంచే ప్రతిపాదనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల ప్రాతినిధ్య నిష్పత్తిని 2051 వరకు కొనసాగించేలా కొత్త బిల్లులో నిబంధనలు రూపొందించినట్లు సమాచారం.

- మిగతా 2లో

దక్షిణాది సీట్లకు ఢోకా వద్దు!

50 శాతం పెంపే సరైన పరిష్కారం



- ఢిల్లీలో కుమారస్వామితో కలిసి మీడియాతో మాట్లాడిన ఏపీ సీఎం..
- మహిళా రిజర్వేషన్ల అమలుపైనా కీలక వ్యాఖ్యలు
- జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాదికి అన్యాయం జరగకూడదని స్పష్టీకరణ
- రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో సహకరించాలని విజ్ఞప్తి

- మిగతా 2లో

ఉన్నది ఒక్కటే జీవితం..

సార్థకం చేసుకోండి..

యువతకు చిరంజీవి పిలుపు




పెన్ పవర్ డెస్క్:ఎవరికైనా జీవితం ఒక్కటేనని, చెడు అలవాట్లకు బానిస కాకుండా ప్రతి ఒక్కరూ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని అగ్ర కథానాయకుడు చిరంజీవి పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్' ముగింపు

- మిగతా 2లో

దీపం వెలిగించాల్సిందే

తిరుపరంకుండ్రం ఆలయ వివాదంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



పెన్ పవర్ డెస్క్: తిరుపరం కుండ్రం కార్తీక దీపం వివాదంపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపరంకుండ్రం కొండపై ఉన్న పురాతన దీపత్తూన్ స్తంభంపైనే శనివారం సంప్రదాయబద్ధంగా కార్తీక దీపాన్ని

- మిగతా 2లో



ఏపీలో ఖాతా తెరిచిన ఆమ్ ఆద్మీ పార్టీ..

పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు 'ఆప్' బలపరిచిన అభ్యర్థుల విజయం

- ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికల్లో ఆప్ బోణీ
- దుప్పలపూడి పంచాయతీలో రెండు వార్డులు కైవసం
- 3వ వార్డులో కొల్లాపు లక్ష్మణ్ విజయం
- 6వ వార్డులో గెలుపొందిన తంగుడు దుర్గ
- అభ్యర్థులకు అభినందనలు తెలిపిన పార్టీ నాయకత్వం

- మిగతా 2లో

కేసీఆర్ వార్నింగ్ ఇవ్వడంతోనే జగన్ పనులు ఆపేశారు

- రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జగన్ చేసిన వ్యాఖ్యలకు కాల్వ శ్రీనివాసులు కౌంటర్
- జగన్ కు వార్నింగ్ గురించి గతంలో హరీశ్ రావు చెప్పారన్న టీడీపీ ఎమ్మెల్యే
- ప్రాజెక్టుపై స్టే వచ్చినా అప్పీల్ చేయకుండా జగన్ తాత్సారం చేశారని విమర్శ

- మిగతా 2లో



గుంటూరు మార్కెట్‌లో మునగకాయ

ధరలు పైపైకి..

కిలో రూ.150!

- గుంటూరు మార్కెట్‌లో మునగకాయ ధర రికార్డు స్థాయికి చేరిక
- ఒక్కో మునక్కాయ ధర గరిష్ఠంగా రూ. 30 నమోదు
- కార్తిక మాసం, పెళ్లిళ్ల సీజన్‌తో పెరిగిన డిమాండ్
- తుపాన్లు, వర్షాభావం కారణంగా తగ్గిన స్థానిక దిగుబడి
- మరో రెండు నెలల వరకు ధరలు తగ్గే అవకాశం లేదన్న వ్యాపారులు

- మిగతా 2లో



పెన్ పవర్

శనివారం 28 నవంబర్ 2026



డీలిమిటేషన్.. దేశ రాజకీయ ముఖచిత్రం మారేనా?

నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్రం కీలక అడుగు,

జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యంలో మార్పులకు అవకాశం,

దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై సర్వత్రా చర్చ

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో మరో కీలక అధ్యాయానికి తెరలేచే సంకేతాలు కనిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వస్తున్న వార్తలు రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 30న లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఇది కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మార్చే ప్రక్రియగానే కాకుండా దేశ రాజకీయ అధికార సమీకరణాలను ప్రభావితం చేసే కీలక పరిణామంగా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రజాస్వామ్యంలో డీలిమిటేషన్ ప్రాధాన్యం : ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజాప్రాతినిధ్యమే పునాది. జనాభాలో వచ్చిన మార్పులకు అనుగుణంగా లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్ణయించే ప్రక్రియను డీలిమిటేషన్‌గా వ్యవహరిస్తారు. ప్రతి ఓటరుకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం, జనాభా అసమానతలను తగ్గించడం, నియోజకవర్గాల మధ్య సమతుల్యత సాధించడం దీని ప్రధాన లక్ష్యాలు. దేశంలో పట్టణీకరణ, వలసలు, జనాభా పెరుగుదల, గ్రామీణ ప్రాంతాల్లో మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉంది. ఈ అసమానతలను సరిదిద్దేందుకు నియోజకవర్గాల పునర్విభజన అవసరమే అయినప్పటికీ, అందుకు అనుసరించే ప్రామాణికాలే ఇప్పుడు కీలకంగా మారాయి.

రాజ్యాంగం ఏం చెబుతోంది? : భారత రాజ్యాంగంలోని 82, 170 అధికరణలు లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన అంశాలను నిర్దేశిస్తున్నాయి. జనాభా నియంత్రణ చర్యలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్రాలవారీగా లోక్‌సభ స్థానాల కేటాయింపులో మార్పులపై గతంలో ఆంక్షలు విధించారు. 84వ రాజ్యాంగ సవరణ ద్వారా 2026 తర్వాత నిర్వహించే తొలి జనగణనకు సంబంధించిన గణాంకాలు ప్రచురితమయ్యే వరకు ఈ పరిమితిని కొనసాగించేలా నిబంధనలు రూపొందించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనకు ఎలాంటి విధానాన్ని అనుసరిస్తారు? ఏ జనాభా గణాంకాలను ప్రామాణికంగా తీసుకుంటారు? ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచుతారా? రాష్ట్రాల మధ్య స్థానాల నిష్పత్తిలో మార్పులు చేస్తారా? అన్న ప్రశ్నలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

దక్షిణాదికి జనాభా నియంత్రణే శాపమవుతుందా? : డీలిమిటేషన్ అంశంలో ప్రధానంగా వ్యక్తమవుతున్న ఆందోళన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించినది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ, విద్య, వైద్యం, మహిళా సాధికారత వంటి రంగాల్లో సాధించిన పురోగతి కారణంగా జనాభా వృద్ధిని నియంత్రించగలిగాయి. మరోవైపు దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో జనాభా వృద్ధిరేటు అధికంగా ఉంది. కేవలం జనాభా సంఖ్యనే ప్రామాణికంగా తీసుకుని లోక్‌సభ స్థానాలను పునఃకేటాయిస్తే అధిక జనాభా కలిగిన రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం పెరిగే అవకాశం ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత స్థానాల సంఖ్య తగ్గకపోయినా, మొత్తం లోక్‌సభలో వాటి ప్రాతినిధ్య నిష్పత్తి తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వమే ప్రోత్సహించిన జనాభా నియంత్రణ విధానాలను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడితే అది ఎంతవరకు సమంజసం? అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు ప్రోత్సాహం అందించాల్సిన తరుణంలో వాటి రాజకీయ ప్రాధాన్యం తగ్గే పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.

తెలుగు రాష్ట్రాల భవిష్యత్తుపై ప్రభావం : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు 25, తెలంగాణకు 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ సంఖ్యలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 153కు పెంచే అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ పెంపు రాజ్యాంగ నిబంధనలకు లోబడి అమలు కావాల్సి ఉంది. నియోజకవర్గాల సంఖ్య పెరిగితే స్థానిక నాయకత్వానికి కొత్త అవకాశాలు లభించడంతో పాటు ప్రజలకు ప్రజాప్రతినిధులు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ వంటి మహానగరాలతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల జనాభా మార్పులకు అనుగుణంగా నియోజకవర్గాల స్వరూపం మారవచ్చు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల కేటాయింపులోనూ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

మహిళా రాజకీయ ప్రాతినిధ్యానికి కొత్త దిశ : నియోజకవర్గాల పునర్విభజనతో మహిళా రిజర్వేషన్ల అమలు అంశం కూడా ముడిపడి ఉంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 106వ రాజ్యాంగ సవరణ చట్టం అమలుకు జనగణన, తదనంతర డీలిమిటేషన్ ప్రక్రియ కీలకం. మహిళలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడుతుంది. అయితే, రిజర్వేషన్ల అమలులో పారదర్శకత, సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

సమాఖ్య స్ఫూర్తిని కాపాడాల్సిందే : భారతదేశం విభిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలు, సామాజిక పరిస్థితులతో కూడిన సమాఖ్య వ్యవస్థ. దేశ రాజకీయ వ్యవస్థలో ప్రతి రాష్ట్రానికీ సముచిత ప్రాధాన్యం ఉండాలి. జనాభా ఆధారంగా ప్రజలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న వాదన ఎంత ముఖ్యమో, రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యతను కాపాడాలన్న వాదన కూడా అంతే ముఖ్యమైనది. జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య అవసరమే. అదే సమయంలో జనాభా నియంత్రణలో విజయం సాధించిన రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించడం కూడా సమాఖ్య వ్యవస్థ బాధ్యత. ఈ రెండు అంశాల మధ్య సమన్వయం సాధించేలా కేంద్రం విధివిధానాలను రూపొందించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, రాజ్యాంగ నిపుణులు, ప్రజాసంఘాలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. అవసరమైతే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలి.

రాజకీయ ప్రయోజనాలకంటే ప్రజాస్వామ్య ప్రయోజనాలే ముఖ్యం : నియోజకవర్గాల పునర్విభజన వల్ల దేశంలో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. రాజకీయ పార్టీల బలాబలాలు, ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం, కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటులో రాష్ట్రాల పాత్ర వంటి అంశాలపై దీర్ఘకాలిక ప్రభావం పడవచ్చు. అందువల్ల డీలిమిటేషన్ ప్రక్రియ ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రయోజనాలకో, ఏ ఒక్క ప్రాంత ఆధిపత్యానికో పరిమితం కాకూడదు. నియోజకవర్గాల సరిహద్దుల నిర్ధారణలో భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యం, జనాభా నిష్పత్తి, సామాజిక సమీకరణాలు, ప్రజల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. స్వతంత్రత, నిష్పాక్షికత, పారదర్శకత ఈ ప్రక్రియకు మూలస్తంభాలుగా నిలవాలి.

పునర్విభజన ప్రజాస్వామ్య బలోపేతానికే కావాలి! : మారుతున్న జనాభా పరిస్థితులకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం అవసరమే. అయితే, ఆ ప్రక్రియ దేశ ఐక్యతకు, ప్రాంతీయ సమతుల్యతకు, సామాజిక న్యాయానికి విఘాతం కలిగించకూడదు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగబద్ధమైన రక్షణ కల్పించే అంశాన్ని కేంద్రం పరిశీలించాలి. పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం దాని ప్రతిపాదనలపై సమగ్ర చర్చ జరగాలి. రాష్ట్రాల ఆందోళనలకు కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. మెజారిటీ బలంతో నిర్ణయాలు తీసుకోవడం కంటే ఏకాభిప్రాయంతో ముందుకు సాగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు శ్రేయస్కరం. డీలిమిటేషన్ అంటే కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మార్చడం కాదు.. దేశ రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించడం. జనాభా సంఖ్యకు న్యాయం చేస్తూనే రాష్ట్రాల హక్కులకు రక్షణ కల్పించాలి. అభివృద్ధికి శిక్షగా కాకుండా ప్రజాస్వామ్యానికి మరింత బలాన్ని చేకూర్చే ప్రక్రియగా నియోజకవర్గాల పునర్విభజన నిలవాలి. అదే నిజమైన సమాఖ్య స్ఫూర్తి.

పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో 'పోస్టుల గారడీ'!

పరిపాలనా సౌలభ్యమా..లేక మార్పు వెనుక మరో కారణమా..?

కార్యాలయ నిర్వహణ కోసం ఉద్యోగులకు విధులు కేటాయించడం సాధారణ పరిపాలనా ప్రక్రియే. అయితే, ఒక కీలక రెవెన్యూ పోస్టులో పనిచేస్తున్న అధికారిని మరో పోస్టుకు ఇన్‌చార్జిగా మార్చి, అదే సమయంలో వేరొక ఉద్యోగికి ఆ బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న కారణాలను వివరించాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు మండలంలోని భూముల పరిశీలన, రెవెన్యూ రికార్డుల పర్యవేక్షణ, క్షేత్రస్థాయి నివేదికలు, వివిధ భూ వ్యవహారాలకు సంబంధించిన కీలక బాధ్యతలతో ముడిపడి ఉంటుంది. అలాంటి పోస్టులో బాధ్యతల మార్పు జరిగినప్పుడు, దాని వెనుక ఉన్న పరిపాలనా అవసరాలను స్పష్టంగా వెల్లడించాలి. ప్రస్తుతం ఉన్న ఆర్ఐ తహశీల్దార్‌కు కొన్ని కీలక భూ వ్యవహారాల్లో సహకరించడం లేదనే ప్రచారం కూడా రెవెన్యూ ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆర్ఐని తాత్కాలికంగా మరో పోస్టుకు మార్చి, సీనియర్ అసిస్టెంట్‌ను ఆర్ఐ బాధ్యతల్లోకి తీసుకువచ్చారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ ప్రచారానికి సంబంధించి అధికారిక నిర్ధారణ లేదు. సంబంధిత అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

తహశీల్దార్‌కు అధికార పరిధి ఎంత?

ఆంధ్రప్రదేశ్ పరిపాలనా నిబంధనలు, సర్వీస్ రూల్స్ ప్రకారం కార్యాలయ విధుల పంపిణీకి సంబంధించి తహశీల్దార్‌కు కొన్ని అధికారాలు ఉండవచ్చు. అయితే, వేర్వేరు పోస్టుల మధ్య అధికారిక ఇన్‌చార్జ్ బాధ్యతలను పరస్పరం మార్చడం, సంబంధిత పోస్టుల అధికారాలను అప్పగించడం వంటి అంశాలు నిర్దిష్ట నిబంధనలకు లోబడి ఉండాలి. ఈ నేపథ్యంలో పెందుర్తి తహశీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించి కొన్ని కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ పరస్పర ఇన్‌చార్జ్ నియామకాలకు తహశీల్దార్‌కు పూర్తి అధికార పరిధి ఉందా? ఈ నిర్ణయానికి సంబంధించి ఆర్‌డీఓ లేదా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకున్నారా? సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారాల డెలిగేషన్ వివరాలు ఉత్తర్వుల్లో ఎందుకు పేర్కొనలేదు? కీలక భూ వ్యవహారాలు కొనసాగుతున్న సమయంలోనే ఈ బాధ్యతల మార్పు ఎందుకు చేపట్టారు? ఈ మార్పుల వల్ల భూముల రికార్డులు, ఫైళ్ల నిర్వహణపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తేనే బాధ్యతల మార్పు వెనుక ఉన్న పరిపాలనా కారణాలు స్పష్టమవుతాయి.

ఆర్‌డీఓ, జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ చేపట్టాలి

పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ బాధ్యతల మార్పు వ్యవహారంపై రెవెన్యూ డివిజనల్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు, రెవెన్యూ వర్గాలు కోరుతున్నాయి. బాధ్యతల మార్పుకు సంబంధించిన ఫైల్ నోటింగ్స్, ఉత్తర్వుల నేపథ్యం, సంబంధిత భూముల రికార్డులు, పెండింగ్‌లో ఉన్న భూ వ్యవహారాలు, ఉద్యోగుల విధుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ నిర్వహించి, బాధ్యతల మార్పు నిబంధనలకు అనుగుణంగా జరిగిందా? ఏదైనా వ్యక్తిగత లేదా ఇతర ప్రయోజనాల కోసం అధికార పరిధిని వినియోగించారా? అనే అంశాలను నిర్ధారించాలని కోరుతున్నారు. పరిపాలనా సౌలభ్యం పేరుతో తీసుకున్న నిర్ణయం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా మారకూడదని, రెవెన్యూ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పెందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తారా? బాధ్యతల మార్పు వెనుక ఉన్న కారణాలను వెల్లడిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది

డీలిమిటేషన్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం!

దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలకు పరిష్కారంగా..

డీలిమిటేషన్ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోవచ్చన్న ఆందోళనలు గతంలో వ్యక్తమయ్యాయి. జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజిస్తే కొన్ని రాష్ట్రాల ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పులు రావచ్చని రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలిపాయి. ఈ నేపథ్యంలో ఏ రాష్ట్రానికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్య వాటా తగ్గకుండా అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచే ప్రతిపాదనను కేంద్రం తీసుకొచ్చింది.

2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన

కొత్త ప్రతిపాదనలో నియోజకవర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే రాష్ట్రాల మధ్య లోక్‌సభ స్థానాల ప్రస్తుత నిష్పత్తిని మాత్రం 2051 వరకు కొనసాగించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

డీలిమిటేషన్ ప్రతిపాదనతో పాటు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం కొత్త బిల్లులో చేర్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన గత బిల్లు లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మద్దతు పొందలేక ఆమోదం పొందలేదు. దీంతో తాజా మార్పులతో మరోసారి బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధమైంది.

నవంబర్ 30 నుంచి ప్రత్యేక సమావేశాలు

ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. నవంబర్ 30న లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కానుండగా, డిసెంబర్ 2 నుంచి రాజ్యసభ సమావేశం కానుంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదం పొందేందుకు కేంద్రం ప్రయత్నించనుంది. అయితే క్యాబినెట్ ఆమోదం పొందడం మాత్రమే చట్టంగా మారినట్లు కాదు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణకు అవసరమైన మెజారిటీతో ఆమోదం పొందాల్సి ఉంటుంది.

ఈ బిల్లు ఆమోదం పొందితే లోక్‌సభలో రాష్ట్రాల వారీగా స్థానాల సంఖ్య పెరగడంతో పాటు మహిళా రిజర్వేషన్ల అమలుకు కూడా మార్గం సుగమమయ్యే అవకాశం ఉంది. అయితే బిల్లులోని పూర్తి నిబంధనలు, రాష్ట్రాల వారీగా పెరిగే స్థానాల వివరాలు పార్లమెంట్ ముందుకు వచ్చిన తర్వాత మరింత స్పష్టత రానుంది

అమెరికాను ముంచెత్తిన వరదలు, మంచు తుపాను

- మొదటి పేజీ తరువాయి

పెనుగా లులు, ఆకస్మిక వరదలు, దట్టమైన మంచు తుపానులతో దేశంలోని పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ముఖ్యంగా అమెరికా తూర్పు తీర రాష్ట్రాలపై తుపాను ప్రభావం తీవ్రంగా పడింది. ఈ విపత్తు కారణంగా దాదాపు 10 లక్షల ఇళ్లు, వ్యాపార సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల అమెరికావ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించింది. 2,200 కంటే ఎక్కువ విమాన సర్వీసులు ఆలస్యంగా నడవగా, 400కి పైగా విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. రోడ్లు, రైలు మార్గాలు సైతం వరద నీటిలో మునిగిపోయాయి.న్యూయార్క్ నగరంలో ఏటా అట్టహాసంగా నిర్వహించే ప్రపంచ ప్రఖ్యాత 'మేసీస్ థాంక్స్ గివింగ్ డే పరేడ్' చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వాయిదా పడింది. వీధుల్లో తిరిగే భారీ బెలూన్లకు బలమైన గాలుల వల్ల ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు ఈ పరేడ్‌ను శనివారానికి వాయిదా వేశారు. ఈ వార్షిక వేడుక ఇలా వాయిదా పడటం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. మరోవైపు వరదల తీవ్రత దృష్ట్యా న్యూజెర్సీ, న్యూయార్క్‌లలోని పలు ప్రాంతాల్లో ఎమర్జెన్సీ విధించారు. న్యూజెర్సీలోని అవలోన్, ఓషన్ సిటీలలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. రోడ్లు జలమయం కావడంతో కార్లలో చిక్కుకుపోయిన అనేకమందిని సహాయక బృందాలు రక్షించాయి. నార్త్ కరోలినా నుంచి దక్షిణ న్యూ ఇంగ్లాండ్ వరకు తీవ్ర ప్రభావం పడగా, చెసాపీక్ బే బ్రిడ్జ్-టన్నెల్, ఎన్‌సీ 12 ప్రధాన రహదారులను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. మేరీల్యాండ్‌లో విద్యుత్ సమస్యల కారణంగా దాదాపు 20 లక్షల మందికి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

మిడ్‌వెస్ట్ రాష్ట్రాలైన ఇల్లినాయిస్, మిస్సోరీలలో భారీగా మంచు కురిసింది. మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో 7.3 అంగుళాలు, సెయింట్ జెనెవీవ్‌లో 14 అంగుళాల మేర మంచు పేరుకుపోయింది.

వెంట్జ్‌విల్లేలో ఒక ఐస్ అరేనా పైకప్పు మంచు ధాటికి కుప్పకూలింది. అలాగే, పశ్చిమ తీరంలోని కాలిఫోర్నియాలో భారీ అలలు, కెరటాల తీవ్రతకు తీర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పసిఫికా పీర్ కొంత భాగం సముద్రంలో కూలిపోగా, రైలు పట్టాలు దెబ్బతినడంతో ఆమ్‌ట్రాక్ పసిఫిక్ సర్ఫ్‌లైనర్ సేవలను నిలిపివేశారు.

ఈ విపత్తుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. ఫ్లోరిడా వరదలకు సంబంధించి ఇప్పటికే డిజాస్టర్ డిక్లరేషన్‌పై సంతకం చేశామని, తూర్పు తీర తుపాను నష్టంపై ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిశీలిస్తామని వెల్లడించారు. తీవ్రమైన గాలులు, రాకాసి అలలు, వరదల కలయికతో లక్షలాది మంది ప్రజల పండుగ ఉత్సాహం నీరుగారిపోయింది.

దీపం వెలిగించాల్సిందే

- మొదటి పేజీ తరువాయి

వెలిగించాలని ఆదేశించింది. ఉచ్చిపిళ్లైయార్ మండపం నుంచి తీసుకొచ్చిన పవిత్ర జ్యోతితోనే ఈ దీపాన్ని వెలిగించాలని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో అరుళ్మిగు సుబ్రమణ్యస్వామి ఆలయ ట్రస్టీల బోర్డును సుప్రీంకోర్టు తక్షణమే సస్పెండ్ చేసింది. ఆలయ పరిపాలన, నిర్వహణ బాధ్యతలను సజావుగా నడిపించేందుకు మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఎస్. వైద్యనాథన్, జస్టిస్ వి. పార్థిబన్‌లను రిసీవర్లుగా నియమించింది. అంతేకాకుండా, ఆలయం మరియు కొండ పరిసర ప్రాంతాల భద్రతను కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలకు (సీఆర్‌పీఎఫ్) అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.దీపత్తూన్‌పై దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ నవంబర్ 20న ఇచ్చిన మునుపటి ఉత్తర్వులను అధికారులు అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గత ఆదేశాలను ఉల్లంఘించి, దీపత్తూన్‌పై కాకుండా కేవలం ఉచ్చి పిళ్లైయార్ ఆలయం సమీపంలోని దీప మండపం వద్దే దీపం వెలిగించడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వ యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడాన్ని ఉపేక్షించబోమని, ఇలాంటి వైఖరిని ఉక్కుపాదంతో అణచివేయాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నించకూడదని ఘాటుగా వ్యాఖ్యానించింది.

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ, మధురై జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులకు సుప్రీంకోర్టు కోర్టుధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో అధికారుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, సంభాషణల పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని, తదుపరి విచారణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది.తిరుపరంకుండ్రం కొండపై కార్తీక దీపాన్ని ఏ ప్రదేశంలో వెలిగించాలనే అంశంపై ఆలయ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని ఈ కీలక తీర్పును వెలువరించింది.

హసీనా ఓ 'ముల్లు'లా మారారు - బంగ్లాదేశ్

- మొదటి పేజీ తరువాయి

స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలపై భారత్ ఆచితూచి స్పందించిన నేపథ్యంలో బంగ్లా ఈ విధంగా స్పందించింది."బంగ్లా-భారత్ సంబంధాల్లో హసీనా ఓ ముల్లులా తయారయ్యారు. ఆమె వ్యవహారం చికాకుగా మారింది. భారత్ కూడా ఇదే విధంగా భావిస్తోంది. హసీనా ఓ నేరస్థురాలు. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింత ఒప్పందంలో భాగంగానే ఆమె స్వదేశానికి వస్తారు. చేతులకు సంకెళ్లు లేదా కట్టుదిట్టమైన భద్రత నడుమే ఆమె తిరిగి రావాల్సి ఉంటుంది" అని బంగ్లా విదేశాంగ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ పేర్కొన్నారు.షేక్ హసీనా వ్యవహారంపై భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జయస్‌వాల్ ఇటీవల స్పందిస్తూ.. ఆమె స్వయంగా బంగ్లాకు వెళ్లాలనుకోవడం, ఆమె అప్పగింతపై బంగ్లాదేశ్ ప్రభుత్వం నుంచి వచ్చిన విజ్ఞప్తిని వేర్వేరుగా చూస్తున్నామన్నారు. ఆమెను అప్పగించేందుకు ఉన్న న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.

ఉన్నది ఒక్కటే జీవితం.. సార్థకం చేసుకోండి..

- మొదటి పేజీ తరువాయి

కార్యక్రమంలో చిరంజీవి పాల్గొని మాట్లాడారు. జీవితాన్ని సార్థకం చేసుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని అన్నారు."48 సంవత్సరాల కిందట 22 ఏళ్ల ప్రసాద్ అనే యువకుడిగా హీరో అవ్వాలనే జీవిత లక్ష్యంతో చెన్నై ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో అడుగు పెట్టా. రోజూ సాయంత్రం పాండీ బజార్‌లో సరదాగా తిరగడానికి సినీ రంగానికి చెందిన చిన్నా చితక ఆర్టిస్టులంతా వస్తారు. మొదటిసారి స్నేహితుడితో కలిసి టీ తాగేందుకు అక్కడికి వెళ్లా. 'ఎవడ్రా ఈ అబ్బాయి' అని అందరూ నా వైపు వింతగా చూశారు. 'యాక్టర్ అవుదామని ఇనిస్టిట్యూట్‌లో జాయిన్ అయ్యాడు' అని నా ఫ్రెండ్ చెప్పాడు. 'ఒక బీర్ ఇవ్వండి మనోడికి.. భయమంతా పోతుంది' అన్నారు. సినిమా ఇండస్ట్రీలో ఇవన్నీ మామూలే. తాగాలని ఒత్తిడి చేస్తారు. వద్దని చెబుతూ ఇబ్బందికరంగా అక్కడి నుంచి వెళ్లిపోయాను. మళ్లీ ఆ ప్రాంతానికి వెళ్లకూడదనుకుని నిశ్చయించుకున్నా. అదే సమయంలో ఓ పెద్ద మనిషి తారసపడి 'నటుడు అవ్వాలన్న నీ లక్ష్యంవైపే అడుగు వేయ్' అని సలహా ఇచ్చారు. అలా అన్నీ ద

కూటమి పార్టీ నుండి గెలుపొందిన అభ్యర్థులకు కృతజ్ఞతలు...!

కొయ్యూరు టిడిపి మండల అధ్యక్షులు కాకురి చందర్రావు

కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 27: ఈనెల 26న జరిగిన స్థానిక పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన 20 మంది సర్పంచ్ అభ్యర్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన టిడిపి మండల అధ్యక్షులు కాకూరి చందర్రావు. ఈ సందర్భంగా చందర్రావు మాట్లాడుతూ... పంచాయతీల్లో ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కార దిశగా పనిచేయాలని అప్పుడే ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నమ్ముతారని ఆయన అన్నారు. ఏటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి వాటి పరిష్కార దిశగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మండలంలోని33 పంచాయితీల్లో 20 పంచాయితీల్లో కూటమి ప్రభుత్వం గెలుపొందిన సర్పంచులకు ఉపసర్పంచులకు వార్డు మెంబర్లకు, కార్యకర్తలకు, ముఖ్య నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- నవంబర్ 30న ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవకాశం
- జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, నవంబర్ 27 : ఎన్నికల విధుల్లో పాల్గొనే అర్హులైన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. మూడో విడతలో భాగంగా డిసెంబర్ 2న జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల విధులకు నియమితులైన విశాఖపట్నం గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులైన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఇందుకోసం ఈ నెల 30న సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అర్హులైన సిబ్బంది తమకు కేటాయించిన ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి, నిర్దేశిత సమయంలో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఇన్‌స్టామార్ట్‌లో పౌరసరఫరాల అధికారుల ఆకస్మిక తనిఖీలు

అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తింపు

124 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

నిత్యావసర సరుకుల చట్టం కింద కేసు నమోదు

విశాఖ పశ్చిమం పెన్ పవర్ నవంబర్ 27: ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్న ఇన్‌స్టామార్ట్‌పై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విశాఖ నగరంలోని సుజాతనగర్‌లో ఉన్న ఇన్‌స్టామార్ట్‌లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 124 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో) భాస్కరరావు వెల్లడించారు.తనిఖీల్లో హెచ్‌ఎంటీ, బీపీటీ రకాల బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తున్న నేపథ్యంలో అక్కడ నిల్వ ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న



బియ్యం విలువ రూ. 1,16,729గా పేర్కొన్నారు. ఈ ఘటనపై నిత్యావసర సరుకుల చట్టం--1955లోని సెక్షన్ 6-ఏ కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నిత్యావసర సరుకులను విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు సరుకులు విక్రయించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో భాస్కరరావు హెచ్చరించారు.

గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికలకు సర్వం సిద్ధ.

.రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి--జిల్లా కలెక్టర్.



పార్వతీపురం నవంబర్ 27 పెన్ పవర్.పార్వతీపురం మన్యం జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా.ఎన్.ప్రభాకర రెడ్డి,ఐ.ఏ.ఎస్. తెలిపారుఈ మేరకు 2 వ విడతలో పాలకొండ,వీరఘట్టం, సీతంపేట,భామిని మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయని.ఈ నాలుగు మండలాల పరిధిలో మొత్తం146గ్రామ పంచాయతీలు, 1274 వార్డులు ఉన్నాయి.వీటిలో32 సర్పంచ్ స్థానాలు,555 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి .మిగిలిన114గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు, 719వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది. సర్పంచ్ స్థానాలకు 285మంది,వార్డు సభ్యుల స్థానాలకు1542మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.రెండో విడతలో మొత్తం172951మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.వీరిలో పురుషులు84 119మంది ,మహిళలు88818మంది ,ఇతరులు14మంది ఉన్నారన్నారు.ఎన్నికల నిర్వహణకు2981మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు.పోలింగ్ జరిగే అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు.

నేవీ డే, వైజాగ్ నేవీ మారథాన్‌లను విజయవంతం చేయాలి



- డిసెంబర్ 4న ఆర్కే బీచ్‌లో నౌకాదళ విన్యాసాలు
- డిసెంబర్ 13న వైజాగ్ నేవీ మారథాన్
- మారథాన్‌లో 15 వేల మందికి పైగా పాల్గొనే అవకాశం
- జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్

బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, నవంబర్ 27: విశాఖపట్నంలో డిసెంబర్ 4న నిర్వహించనున్న నేవీ డే వేడుకలు, డిసెంబర్ 13న జరగనున్న వైజాగ్ నేవీ మారథాన్‌ను విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నౌకాదళ, జిల్లా అధికారులతో ఆయా కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 3న ఆర్కే బీచ్‌లో నౌకాదళ విన్యాసాలకు సంబంధించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్, 4న నేవల్ ఆపరేషనల్ డెమాన్‌స్ట్రేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు నౌకాదళ అధికారులకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకారం అందించాలని సూచించారు.నౌకాదళ విన్యాసాలను తిలకించేందుకు వచ్చే అతిథులు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, పార్కింగ్, విద్యుత్ సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు సహకరించాలని నౌకాదళ అధికారులు కోరారు. భద్రతా ఏర్పాట్లలో పోలీస్ శాఖ ప్రత్యేక సహకారం అందించడంతో పాటు విన్యాసాలు జరిగే ప్రాంతాన్ని నో డ్రోన్ ఫ్లై జోన్‌గా ప్రకటించాలని కలెక్టర్‌ను కోరారు.

నాలుగు విభాగాల్లో నేవీ మారథాన్

డిసెంబర్ 13న నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్-2026లో 15 వేల మందికి పైగా పాల్గొనే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. తూర్పు నౌకాదళ ఆధ్వర్యంలో 42 కిలోమీటర్ల ఎయిర్ క్రాఫ్ట్ రన్, 21 కిలోమీటర్ల సబ్‌మెరైన్ రన్, 10 కిలోమీటర్ల ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ రన్, 5 కిలోమీటర్ల ఫ్రిగేట్ రన్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్కే బీచ్ నుంచి ప్రారంభమయ్యే పరుగులు విశాఖ సాగరతీరం వెంబడి ఆయా విభాగాలకు నిర్దేశించిన మార్గాల్లో కొనసాగనున్నాయి. మారథాన్ మార్గం భీమునిపట్నంలోని ఐఎన్ఎస్ కళింగ వరకు విస్తరించనుంది.ప్రజల్లో శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు తీరప్రాంతంపై అవగాహన కల్పించేందుకు మారథాన్ దోహదపడుతుందని నౌకాదళ అధికారులు తెలిపారు. మారథాన్ విజయవంతానికి జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎఎఎ.జఱఓఘస్త్రఱుఅఎఱుతీఘ్ష్ట్రశీఅ.తీబఅ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, 7386007503, 9515448412 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డీసీపీ చందోలు మణికంఠ, డీఆర్వో ఎస్.డి. అనిత, రేస్ ఆర్గనైజర్ కమాండర్ ఎస్.ఎస్. దోడి, రేస్ కన్సల్టెంట్ టి. రవికుమార్, ఆఫీసర్ ఇన్‌చార్జి రిటైర్డ్ లెఫ్టినెంట్ కమాండర్ రోషన్ సాహూ, పలువురు జిల్లా, నౌకాదళ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వొద్దు



- ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి
- పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్
- నక్కపల్లిలో రిటర్నింగ్ అధికారులకు శిక్షణ

స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ నక్కపల్లి, నవంబర్ 27: జిల్లాలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను శుక్రవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్‌తో కలిసి ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. అధికారులు తమకు కేటాయించిన ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా, నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ కనీస మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎన్నికల నిబంధనలు, పోలింగ్ విధానం, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్డురోడ్డు రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి, జిల్లా అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ భవనానికి స్పీకర్ శంకుస్థాపన

-రూ. 4 కోట్లతో నిర్మాణం, యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 27) : బయ్యపురెడ్డిపాలెం ఐటీఐ కళాశాల సమీపంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

?ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఎకరం విస్తీర్ణంలో రూ. 4 కోట్ల వ్యయంతో గ్రౌండ్ ప్లోర్ మరియు మొదటి అంతస్తు నిర్మిస్తామని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలో సుమారు 2 వేల మంది మేస్త్రీలు ఉన్నారని, నిర్మాణ రంగంపై సుమారు 20 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ భవనం పూర్తయ్యాక తాపీ పని, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ల్యాండ్ సర్వేయర్, బార్ బెండింగ్, స్టీల్ ఫిక్సింగ్ వంటి రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. పని నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారితో పాటు ఇప్పటికే పని వచ్చిన వారికి కూడా నైపుణ్యాలు అందిస్తారని అన్నారు. ?కొత్తగా శిక్షణ పొందాలనుకునే వారి కోసం 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి 3 బ్యాచ్‌లుగా ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఒకేసారి 90 మందికి 3 నెలల పాటు శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణ సమయంలో హాస్టల్ వసతితో పాటు భోజనం కల్పిస్తారని, 3 నెలలు



పూర్తయ్యాక సర్టిఫికెట్ అందజేసి నైపుణ్యాలకు తగిన అవకాసాలు కూడా ఇప్పిస్తారని తెలిపారు. ఇప్పటికే పని తెలిసిన వారికి 15 రోజుల పాటు 45 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి రిఫ్రెషర్ శిక్షణ నిర్వహిస్తారని, రోజుకు రూ. 300 చొప్పున శిక్షణ భత్యంగా అందజేస్తారని చెప్పారు. శిక్షణకు హాజరయ్యే వారు తప్పనిసరిగా రేషన్ కార్డుతో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందజేసి నమోదు చేసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, స్టేట్ వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర, వార్డు కౌన్సిలర్లు , అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలిచిన 16 వ వార్డు ఏ ఎస్ ఆర్ నగర్ సేవా సంఘం

కార్పొరేటర్ ఏడువాక శ్రీమహాలక్ష్మి సన్యాసిరావు చేతుల మీదుగా పార్వతమ్మ కు 15 వేల ఆర్థిక సహాయం

విశాఖ తూర్పు,పెన్ పవర్ నవంబర్ 27:16వ వార్డు పరిధిలోని ఏ ఎస్ ఆర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న పార్వతి మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఏ ఎస్ ఆర్ నగర్ గ్రామ సేవా సంఘం సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు.సంఘ సభ్యులందరూ కలిసి సమకూర్చిన రూ. 15,000 నగదును కార్పొరేటర్ ఏడువాక శ్రీమహాలక్ష్మి సన్యాసిరావు చేతుల మీదుగా పార్వతమ్మ కు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ఏ ఎస్ ఆర్ నగర్ సేవా సంఘ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ఎంతో గొప్ప విషయమని,ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు.పార్వతమ్మ కు వైద్య సహాయం అందించడంలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని,కుటుంబానికి అవసరమైన ఇతర సహాయ కార్యక్రమాల్లోనూ అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా, కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి తన వంతు సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి బాలాస్వామి, ఏఎస్ఆర్ నగర్ గ్రామ సేవా సంఘం సభ్యులు,టిడిపినాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల నమ్మకాన్ని నిలబెట్టి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా

సంకాడ పంచాయతీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ ఊలం ఈశ్వరరావు



గూడెం కొత్త వీధి, పెన్ పవర్, నవంబర్ 27:అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండలం సంకాడ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన ఊలం ఈశ్వరరావు పంచాయతీ ప్రజలకు, కూటమి నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ కూటమి తరఫున సర్పంచ్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించి, నమ్మకంతో బలపరిచిన కూటమి పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.సంకాడ పంచాయతీ పరిధిలోని 13 గ్రామాల ప్రజలు తనపై చూపిన ఆదరాభిమానాలు, ప్రోత్సాహం, సహకారం మరువలేనివని పేర్కొన్నారు. ముఖ్యంగా కూటమి నాయకులు, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు అందించిన మద్దతు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందన్నారు.సర్పంచ్‌గా తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంకాడ పంచాయతీలోని ప్రతి గ్రామం అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటానని ఊలం ఈశ్వరరావు తెలిపారు.

దేవరాపల్లి అభివృద్ధికి యువతే దిక్సూచి..

దేవరాపల్లి సర్పంచ్‌గా గదుతూరి సాయికుమారి ఘన విజయం



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 27:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దేవరాపల్లి పంచాయతీ సర్పంచ్‌గా కూటమి బలపరిచిన అభ్యర్థి గదుతూరి సాయికుమారి ఘన విజయం సాధించారు. ఆమె విజయంతో కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, యువత నాయకత్వంలో పంచాయతీలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని దేవరాపల్లి ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యావంతులైన యువత గ్రామ పాలనలో భాగస్వాములైతే అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మండల ఉపాధ్యక్షుడు పాడి శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లకే రామారావు, ప్రధాన కార్యదర్శి తూబెరి కుమారి, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.వి.వి.వి. ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు అప్పారావు, సిరిబాల రామకృష్ణ, సిరిబాల రుద్ర, శ్రీనివాసరాజు, గదుతూరి బాబురావు, గదుతూరి పోతురాజు, సిరిబాల గణేష్, అడపా పరమేశ్వరరావు, జనసేన నాయకులు గోపి నాయక్, విజయ్, మొట్టడం సురేష్ తదితరులు పాల్గొన్నారు.అలాగే వార్డు సభ్యులు తుబెరి ధరలక్ష్మి, దేవరాజు వెంకటేశ్వర్లు, రేగటి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ విజయానికి సహకరించిన ఇంగువ రామారావు, కుమ్మరి రవిబాబు, బీజేపీ అధ్యక్షుడు కాకూరి శేఖర్, గౌడు వెంకటరమణ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సాయికుమారి విజయానికి పూర్తి మద్దతు అందించిన అన్ని వర్గాల నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

చింతలపూడి సర్పంచ్ "సెగ్గే విజయ్ కుమార్ "కు శుభాకాంక్షలు

అరకు పార్లమెంట్ మాజీ ఎంపీ" గొడ్డేటి మాధవి"




కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 27: చింతలపూడి పంచాయతీ సర్పంచ్ గా పోటీ చేసి విజయం సాధించిన సెగ్గే విజయ్ కుమార్ కు అరకు మాజీ పార్లమెంట్ సభ్యురాలు గొట్టేటి మాధవి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. శుక్రవారం సర్పంచ్ విజయకుమార్, ఉప సర్పంచ్ కొండోజు అప్పలకొండ, వార్డు మెంబర్లను ను చింతలపూడి లో కలిసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... నిరంతరం ప్రజా సమస్యలపై గలమెత్తి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంతరం ప్రజా సమస్యలపై దృష్టి సాధించినప్పుడే పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైనందుకు సార్థకత ఏర్పడుతుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎంపీటీసీ కూడా వెంకటలక్ష్మి,వైఎస్ఆర్సిపి శ్రేణులు తోపాటు ధన్యంరాజు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన అరకు మాజీ ఎంపీ జి మాధవి:
ఇటీవల కాకరపాడు సమీపంలో బైక్ ప్రమాదన గురి మృతి చెందిన లోవ ప్రసాద్ కుటుంబాన్ని అరకు పార్లమెంటు మాజీ సభ్యురాలు గొడ్డేటి మాధవి శుక్రవారం పరామర్శించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించి వైఎస్ఆర్సిపి పార్టీ పరంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఏప్పుడు ఏ అవసరం ఏర్పడిన తనను సంప్రదించాలని కోరారు.

కేజీహెచ్‌లో గిరిజన రోగులకు పరామర్శించిన జడ్పీ చైర్‌పర్సన్ వంతల శాంతి





- గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలి
- కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు

పాడేరు పెన్ పవర్:నవంబర్ 27:మారుమూల గిరిజన ప్రాంతాల నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు వస్తున్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వంతల శాంతి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలికేజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీచేశారు. దానికన్నా ముందు జెడ్పీ చైర్ పర్సన్ గురువారం విశాఖ కేజీ హెచ్ సందర్శించారు. గిరిజన ప్రాంతం నుండి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న గిరిజన బాధితులను
ఆమె స్వయంగా వార్డులకు వెళ్లి పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని వారికి అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బంగారుమామిడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాంగి విశ్వనాథం , డి. ఎర్రయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని కూడా పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. ఏ అవసరం వచ్చినా వెంటనే నాను సంప్రదించాలని అన్నారు.కేజీ హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి , ఇన్చార్జి సూపర్డెంట్ డాక్టర్ చంద్ర శేఖర్ ను కలిసి గిరిజన రోగుల వైద్య పరిస్థితిపై చర్చించారు. ముఖ్యంగా అల్లూరి జిల్లా ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు చేరుకుంటున్న గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అన్నారు. గిరిజనులు ఆర్థికంగా, రవాణా పరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ సుదూర ప్రాంతాల నుంచి కేజీ హెచ్ కు వస్తుంటారని, అటువంటి వారికి వైద్య సేవల విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, నిపుణుల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందించాలని, వైద్యం కోసం వచ్చిన ఏ ఒక్కరూ నిర్లక్ష్యానికి గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

వైసీపీ కంచుకోటలో సీపీఎం జయకేతనం



జీకేవీధి సర్పంచ్‌గా అంపురంగి బుజ్జిబాబు విజయం

గూడెంకొత్తవీధి, నవంబర్ 27, పెన్ పవర్:అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కీలకమైన మండల కేంద్రం గూడెంకొత్తవీధి పంచాయతీ ఎన్నికల్లో సీపీఎం జయకేతనం ఎగురవేసింది. వైసీపీకి బలమైన పట్టున్న పంచాయతీలో ఆ పార్టీ అభ్యర్థి నుంచి తీవ్ర పోటీ ఎదురైనా సీపీఎం అభ్యర్థి అంపురంగి బుజ్జిబాబు విజయం సాధించి సర్పంచ్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు.

హోరాహోరి పోరు.. స్వల్ప మెజారిటీ:
మండల కేంద్రం కావడంతో గూడెంకొత్తవీధి పంచాయతీ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ నెల 26న జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నుంచి బుజ్జిబాబుకు గట్టి పోటీ ఎదురైంది. అయితే, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడిగా గుర్తింపు పొందిన బుజ్జిబాబు తుది వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు.గతంలో 2021 ఎన్నికల్లో సీపీఎం తరఫున గాలికొండ ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నికైన బుజ్జిబాబు, ప్రస్తుతం మండల కేంద్రం సర్పంచ్‌గా విజయం సాధించడం సీపీఎం శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.జీకేవీధి నూతన సర్పంచ్ అంపురంగి బుజ్జిబాబు, వార్డు సభ్యుడు కుమార్‌లను సమస్త కాలనీ మహిళలు ఘనంగా సన్మానించారు. నూతన ప్రజాప్రతినిధులకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.పంచాయతీ అభివృద్ధికి వారి గెలుపు మార్పుకు నాంది కావాలని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని మహిళలు ఆకాంక్షించారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.
అనంతరం నూతన ప్రజాప్రతినిధులతో కలిసి బోడకొండమ్మ గుడి వరకు ర్యాలీగా వెళ్లి నినాదాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. బుజ్జిబాబు విజయం, నూతన ప్రజాప్రతినిధులకు లభించిన అభినందనలతో జీకేవీధిలో సందడి నెలకొంది.

మండల ప్రజల నమ్మకమే మా బలం..

గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజాసేవే లక్ష్యం



జెడ్పీటీసీ కంకిపాటి గిరిప్రసాద్, ఎంపీపీ పూజారి లీలాప్రసాద్

గూడెంకొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 27:మండల ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని జీకేవీధి జెడ్పీటీసీ సభ్యుడు కంకిపాటి గిరిప్రసాద్, ఎంపీపీ పూజారి లీలాప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ ఎన్నికల్లో తమకు అఖండ మెజారిటీని అందించిన ఓటర్లకు, అభిమానులకు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.ఎన్నికల్లో తమ విజయానికి అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పత్రికా ముఖంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు అందించిన ఈ విజయాన్ని బాధ్యతగా భావిస్తూ, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

గెలుపొందిన సర్పంచ్‌లకు అభినందనలు
మండలంలోని వివిధ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులుగా విజయం సాధించిన సర్పంచ్‌లతో పాటు, రెబల్‌గా పోటీ చేసి గెలుపొందిన సర్పంచ్‌లకు కూడా గిరిప్రసాద్, లీలాప్రసాద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి నూతన సర్పంచ్‌లు కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఓటమి పాలైన అభ్యర్థులకు భరోసా
ఎన్నికల్లో స్వల్ప తేడాతోనైనా, ఇతర కారణాలతోనైనా ఓటమి పాలైన అభ్యర్థులు అధైర్యపడవద్దని సూచించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజా సేవలో నిరంతరం ముందుండాలని పిలుపునిచ్చారు. ఓటమి పాలైన అభ్యర్థులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి పూర్తి భరోసా కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

జర్రెల పంచాయతీ ప్రజల ఆశీర్వాదం..

రత్నకుమారి ఘన విజయం!



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 27:అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలం జర్రెల పంచాయతీలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బూరిశెట్టి రత్నకుమారి అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించారు. ప్రజలు అందించిన అపూర్వ విజయంతో జర్రెల పంచాయతీలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. రత్నకుమారి విజయం సాధించిన సందర్భంగా జీకేవీధి ఎంపీపీ పూజారి లీలాప్రసాద్, మండల ఉపాధ్యక్షులు అరుణ్, కృప, గిరిరాజు, జర్రెల ఎంపీటీసీ ఎం. రాజమణి, సీనియర్ నాయకులు సింహాచలం, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జర్రెల పంచాయతీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నూతన సర్పంచ్ బూరిశెట్టి రత్నకుమారి నిరంతరం కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

రంపుల జాతీయ రహదారిపై కారు

ఢీ.. కాఫీ రైతుకు తీవ్ర గాయాలు

- వెనుక నుంచి ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయిన గుర్తుతెలియని కారు



గూడెంకొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 27 :అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రంపుల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో కాఫీ రైతు మర్రి అప్పారావు (53) తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంపుల గ్రామానికి చెందిన మర్రి అప్పారావు శుక్రవారం ఉదయం 11.40 గంటల సమయంలో కాఫీ పండ్లు ఏరేందుకు రంపుల గ్రామంలోని టెస్ట్ క్లాస్ వీధి సమీప జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఆయనను ఢీకొట్టింది. దీంతో అప్పారావు రోడ్డుపై పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నారు.ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా కేడిపేట వైపు వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన అప్పారావును స్థానికులు వెంటనే పెదవలస ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి బాధితుడికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన సర్పంచులను అభినందించిన మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి,

కురుపాం నవంబర్ 27 పెన్ పవర్.మండలంలో పెద్దగొత్తిలి పంచాయితీ,నూతన సర్పంచ్ బిడ్డిక పద్మావతి,శుక్రవారం నాడు వైయస్సార్సీపి మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ మేరకు పుష్ప శ్రీవాణి,నూతన సర్పంచ్ ఎంపీటీసీలకు అభినందించి,భరోసా ఇస్తూ పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని పార్టీ కోసం మనందరం సమన్వయంతో కృషి చేయాలని పుష్ప శ్రీవాణి వారికి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు పెద్ద గుత్తిలి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



స్వచ్ఛసైనికుడు దమ్ము శ్రీనివాసరావుకు మానసిక వేదన!

- దాడిలో ఒక కన్ను కోల్పోయి.. ఏడేళ్లుగా న్యాయం కోసం నిరీక్షణ!
- విధులకు వెళ్తుండగా దాడి.. ప్రాణాలతో బయటపడి శాశ్వత అంధత్వం
- పాలిమర్స్ గ్యాస్ లీక్, కరోనా సమయంలోనూ ఒక చూపుతోనే ప్రజాసేవ
- నిందితులు బెయిల్‌పై బయటే.. ప్రాణభయంతో జీవిస్తున్న బాధితుడు
- కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని, పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి



విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 : ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే స్వచ్ఛసైనికుడికి న్యాయం అందని ద్రాక్షగా మారిందా? విధి నిర్వహణలో అడ్డంకులు సృష్టిస్తూ, అక్రమాలకు వ్యతిరేకంగా నిలిచినందుకు ప్రాణాంతక దాడికి గురై ఒక కన్నును శాశ్వతంగా కోల్పోయిన జీవీఎంసీ స్వచ్ఛసైనికుడు దమ్ము శ్రీనివాసరావు గత ఏడేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఎన్నో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా, తనకు జరిగిన అన్యాయంపై న్యాయం అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 నవంబర్ 28న ఉదయం విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న సమయంలో తనపై దాడి జరిగిందని దమ్ము శ్రీనివాసరావు పేర్కొంటున్నారు. విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు అడ్డుగా నిలుస్తున్నాననే కారణంతో కొందరు స్థానికుల ప్రోద్బలంతో సుమారు పది మంది వ్యక్తులు తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కొనఊపిరితో ప్రాణాలతో బయటపడినప్పటికీ, తన కుడి కన్నును శాశ్వతంగా కోల్పోయానని వేదన వ్యక్తం చేస్తున్నారు. శారీరకంగా తీవ్ర వైకల్యానికి గురైనప్పటికీ, దమ్ము శ్రీనివాసరావు తన విధుల పట్ల ఉన్న అంకితభావాన్ని మాత్రం వదులుకోలేదు. విశాఖలో జరిగిన పాలిమర్స్ గ్యాస్ లీక్ ఘటన సమయంలోనూ, కరోనా మహమ్మారి విస్తరించిన క్లిష్ట పరిస్థితుల్లోనూ ఒకే చూపుతో ప్రజలకు సేవలందించారు. తన ఆరోగ్య పరిస్థితిని పక్కనపెట్టి, ప్రజల అవసరాల కోసం విధులు నిర్వహించిన ఆయన సేవలను పలువురు అభినందించారు. ఈ సేవలకు గుర్తింపుగా ఆయనకు పలు పురస్కారాలు కూడా లభించాయని కుటుంబ సభ్యులు, సహచరులు పేర్కొంటున్నారు.

తన కుమారుడి అంధత్వాన్ని చూసి తీవ్ర మనోవేదనకు గురైన తండ్రి మరణించారని శ్రీనివాసరావు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాన్ని పోషించేందుకు, ఒక కన్నుతోనే విధులు నిర్వహిస్తూ జీవన పోరాటం సాగిస్తున్నారు. శారీరక బాధ ఒకవైపు, కుటుంబ ఆర్థిక ఇబ్బందులు మరోవైపు, న్యాయం కోసం సాగుతున్న నిరీక్షణ ఇంకోవైపు.. ఇలా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నానని ఆయన వాపోతున్నారు. తనకు జరిగిన అన్యాయంపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు అధికారులను కలిసి న్యాయం చేయాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని కోరినప్పటికీ తగిన స్పందన లభించలేదని శ్రీనివాసరావు ఆరోపిస్తున్నారు. కేసులో నిందితులు బెయిల్‌పై బయట తిరుగుతున్నారని, వారి నుంచి మళ్లీ దాడులు జరిగే ప్రమాదం ఉందని ప్రాణభయంతో జీవిస్తున్నానని చెబుతున్నారు. న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ, గత ఏడేళ్లుగా కేసు పరిష్కారం కోసం నిరీక్షించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు జరిగిన దాడికి న్యాయం జరగడంతో పాటు, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ప్రజల కోసం, పారిశుద్ధ్య పరిరక్షణ కోసం విధులు నిర్వహించే స్వచ్ఛసైనికుడికి జరిగిన అన్యాయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేస్తున్నారు. తన కేసును సమీక్షించి న్యాయపరమైన చర్యలు వేగవంతం చేయాలని, పోలీసు శాఖ తగిన రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఒక కన్ను కోల్పోయినా ప్రజాసేవలో వెనుకడుగు వేయని వంటి స్వచ్ఛసైనికుడికి న్యాయం అందితే, అది ఆయన కుటుంబానికి మాత్రమే కాకుండా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ప్రతి కార్మికుడికి భరోసా కల్పించినట్లవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏడేళ్ల నిరీక్షణకు ముగింపు పలికి.. బాధితుడికి న్యాయం, భద్రత కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అల్లూరి జిల్లా వైఎస్ఆర్సిపి అడ్డా...!

- వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు "బిడిజన అప్పారావు"



కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 27: మన్య ప్రాంతమైన అల్లూరు జిల్లా అంటేనే వైఎస్ఆర్సిపి అడ్డా అని మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో అప్పారావు మాట్లాడుతూ... మూడు పార్టీలు కూటమై అధికారంలో ఉన్నప్పటికీ మండలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలమైన విజయాలను సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వైసిపి పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అండదండలతో పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు దిశా నిర్దేశాల మేరకు మండలంలో విజయ దంఖ మోగించడం జరిగిందన్నారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం హయామంలో టిడిపి కేవలం ఐదు స్థానాలకే పరిమితమైంది అని గుర్తు చేశారు కానీ అధికార పక్షం ఎన్ని వత్తిళ్లు తెచ్చిన ప్రలోభాలకు గురి చేసిన మండలంలో 14 ఎంపీటీసీలకు నాలుగు ఎంపీటీసీలను 33 గ్రామ పంచాయతీలకు 12 స్థానాలను వైఎస్ఆర్సిపి కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. పార్టీపై ప్రజల్లో ఉన్న ఆదరణకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు మిగిలిన 21 స్థానాల్లో ఓటమిపాలైనప్పటికీ ప్రతి గ్రామంలోని పార్టీకి గణనీయమైన అభిమానులు ఓటు బ్యాంకు ఉందని గుర్తు చేశారు. గిరిజన బిడ్డల గుండెల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి పై ఉన్న అభిమానం చెక్కుచెదరలేదని అలాగే ఎమ్మెల్యే విశ్వేశ్వర ప్రవచనాలు సంపూర్ణ విశ్వాసం ఉంచారని దీనికిఈ ఫలితాలే నిదర్శనమని మరోసారి నిరూపించారు అన్నారు. కష్టకాలంలో ఉన్న వైసిపి పార్టీకి అండగా నిలిచి ఈ విజయాన్ని అందించిన నాయకులకు కార్యకర్తలకు ఓటర్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే స్థానిక ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీటీసీలు సర్పంచులకు కూడా అభినందనలు తెలుపుతూ ఓటమిపాలైన 11 పంచాయతీలు అభ్యర్థులు ఎవరు అధర్య పడవద్దని వారందరికీ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చైర్ పర్సన్ పద్మావతి ఆకస్మిక తనిఖీ

అస్తవ్యస్తంగా ఉన్న ఫార్మసీని చూసి సిబ్బందిపై ఆగ్రహం



నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 27) : 15వ వార్డులో శుక్రవారం ఉదయం 8 గంటల నుండే మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల పద్మావతి, వార్డు కౌన్సిలర్ చల్ల పోతురాజుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. వార్డులోని పలు ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న క్రమంలో, ఆమె అదే వార్డులో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను (పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ?ఆసుపత్రిలోని పరిసరాలు, వైద్య సేవల తీరును పరిశీలించిన చైర్ పర్సన్ అక్కడి ఫార్మసీ గది అస్తవ్యస్తంగా, అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఆరోగ్య కేంద్రంలో నిర్వహణ ఇంత అధ్వాన్నంగా ఉండటమేంటని అక్కడి సిబ్బందిని నిలదీశారు. ?ఆసుపత్రి పరిసరాలను, మందుల గదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి స్పష్టం చేశారు. మరోసారి తాను తనిఖీకి వచ్చేసరికి ఇదే పరిస్థితి పునరావృతమైతే ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.ం

నీటి సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్ మాడిశ కనకరాజు



గాజువాక :పెన్ పవర్ ,నవంబర్ 27 జీవీఎంసీ 101వ వార్డులో గల ఎంవివి ఎంకే పార్క్ అపార్ట్మెంట్స్ లో 400 కే ఎల్ డి నీటి సరఫరా పైప్ లైన్ పనులను స్థానిక వార్డు కార్పొరేటర్ మాడిశ కనకరాజు జీవీఎంసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కనకరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ అపార్ట్మెంట్ వాసులు నీటి కష్టాలతో ఇబ్బందులు ఎందురుకొంటున్నారని, వాళ్ళు పడుతున్న బాధలు తన దృష్టికి అపార్ట్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తీసుకొచ్చారాని తెలిపారు. సమస్య పరిష్కార దిశగా జీవీఎంసీ అధికారులతో చర్చించి అపార్ట్మెంట్లకు సుమారు కోటి ఇరవై ఒక్క లక్షల రూపాయలతో సిద్ధార్థ నగర్ లో గల పంప్ హౌస్ నుండి ఎంవివి ఎంకే అపార్ట్మెంట్స్ వరకు గల 1.1 0 కిలోమీటర్ల 400 కే ఎల్ డి నీటి సరఫరా పైప్ లైన్ పనులు ప్రారంభించామని తెలిపారు. జీవీఎంసీ అధికారుల చొరవతో త్వరలోనే ఈ పనులు పూర్తి అవుతాయని అన్నారు.త్వరలోనే అపార్ట్మెంట్ లకు నీటి సరఫరా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని హర్షం వ్యక్తం చేశారు.

ప్రకృతివ్యవసాయ విస్తరణలో విద్యార్థుల ప్రశంసనీయం.



22 రాష్ట్రాల నుంచి పాల్గొన్న నాబార్డ్ అధికారులు.

నవంబర్ 27 పెన్ పవర్..మొట్టమొదటిసారిగా ఫీల్డ్ లోనే అధికారులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం.నాబార్డ్ నేషనల్ బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ లక్నో డిప్యూటీ జనరల్ మేనేజర్ నిరంజన్ భూయాన్,శుక్రవారం నాడు గుమ్మలక్ష్మీపురం మండలం చాపరాయి బిన్నిడి పంచాయతీ మూలిగూడ గ్రామంలో నాబార్డ్ నేషనల్ బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ లక్నో డిప్యూటీ జనరల్ మేనేజర్ నిరంజన్ భూటాన్,అనిల్ కుమార్ యాదవ్ ల ఉమ్మడి పర్యవేక్షణలో 22 రాష్ట్రాలకు చెందిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు,ఫ్యాకల్టీ మెంబెర్స్ ప్రకృతి వ్యవసాయం విద్యార్థుల ద్వారా తల్లి దండ్రులకు ఎలా చేరవేస్తున్నారు? గ్రామమంతా నూరు శాతం ప్రకృతి వ్యవసాయం చేయుటకు వారు ఎలా ప్రేరణ కల్పించారు?తల్లి దండ్రులకు పిల్లల ద్వారా నేర్చుకున్న అంశాలను ఎలా ఆచరణలో చూపారు అనే విషయాలను వారుఅడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు చేస్తున్న సాగుబడి మరియు వారు చూపిస్తున అంకిత భావం ముచ్చటగా ఉందని,బయో గ్రామంగా ఏర్పడుటకు వారు చేస్తున్న కృషి,పట్టుదల వారి ఇంటిలో స్వయంగా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు తెలుసుకుని వారిని అభినందించారు.మూలిగూడ గ్రామం బయో గ్రామంగా ఏర్పడటానికి ఏయే అంశాలు దోహద పడ్డాయో తెలుసుకున్నారు.అంతేకాక విద్యార్థులు రసాయన ఎరువులు,పురుగు మందులు,కలుపు మందులు వాడటం వలన కలిగే అనర్థాలను గురించి వివరించారు.మిత్ర కీటకాలు పంటల్లో ఏవిధంగా సహకరిస్తున్నాయి.శత్రు కీటకాల అదుపులో వాటి పాత్ర విద్యార్థులు వివరించారు.పోషకాహారం గూర్చి కొన్ని గేయాలు,మిత్ర మరియు శత్రు కీటకాలు పై జట్టు ట్రస్టు రూపొందించిన గేయాలు పాడి వాటియొక్క అర్థాలను వివరించారు.విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఉన్న అవగాహన,వారు తల్లి దండ్రులు రసాయన వ్యవసాయం నుండి ప్రకృతి వ్యవసాయం వైపు మారడంలో చేసిన కృషిని అభినందించారు.బయో గ్రామంగా మారడం విద్యార్థులు మరియు వారి తల్లి దండ్రులు,రైతులు అందించిన సహకారాన్ని బయోవిలేజెస్ కన్సల్టెంట్ ఉమా మహేశ్వరి వివరించారు.పిల్లలకు అవగాహన కల్పించడంలో పాఠ్యపుస్తకాల రూపకల్పన గూర్చి సిలబస్ డెవలప్మెంట్ కన్సల్టెంట్ తుంబలి శివాజీ వారికి వివరించారు.జట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ మరియు రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారి నాయుడు మాట్లాడుతూ,బయో గ్రామాల నిర్మాణంలో పాఠశాల పాత్ర,వివరిస్తూ భావి తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు.పార్వతీపురం మన్యం జిల్లా డెవలప్మెంట్ మేనేజర్ దినేష్ కుమార్ రెడ్డి బడి నుండి పొలం బడికి కాన్సెప్ట్ వివరించి జట్టు ట్రస్టు నిర్వహణలో జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం అమలు చేస్తోందని,ఈ విధానం చాలా బాగుందని అన్ని రాష్ట్రాలలో అమలు చేయాల్సిన అంశమని నాబార్డ్ నేషనల్ బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ లక్నో డిప్యూటీ జనరల్ మేనేజర్ ఫ్యాకల్టీ మెంబెర్ అనిల్ కుమార్ యాదవ్ తెలిపారన్నారు.ఈ క్షేత్ర సందర్శన మరియు శిక్షణ కార్యక్రమంలో బీసీజట్టు ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరోజ్ ప్రహరాజ్,కో-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.నూకం నాయుడు,కల్చరల్ కన్సల్టెంట్ రౌతు వాసు దేవరావు,మార్కెటింగ్ కన్సల్టెంట్ విరాజిత,అసోసియేట్ కల్చరల్ కన్సల్టెంట్ సన్యాసి రావు,జీవ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ప్రభోదు,జీవ ఐ.ఎఫ్.ఆర్.పి లు,రైతులు పాల్గొన్నారు.

రింతాడ అభివృద్ధికి కృషి చేస్తా:సర్పంచ్ గుంట కోటేశ్వరరావు

నమ్మకంతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు

గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 27:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ సర్పంచ్‌గా జనసేన రెబల్ అభ్యర్థిగా పోటీ చేసి ఘనవిజయం సాధించిన గుంట కోటేశ్వరరావు పంచాయతీ ప్రజలకు, అభిమానులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఓటు వేసి సర్పంచ్‌గా గెలిపించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రింతాడ పంచాయతీ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, అందరి సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పంచాయతీ ప్రజలతో పాటు ప్రభుత్వ అధికారులు కూడా పూర్తి సహాయ సహకారాలు అందించాలని గుంట కోటేశ్వరరావు కోరారు.



ఊపందుకున్న పంచాయితీ ప్రచారాలు.



ఐదో నెంబర్ వార్డు అభ్యర్థిగా. ఆకుపాటి భాస్కర్.

హుకుంపేట నవంబర్ 27 పెన్ పవర్ హుకుంపేట మండల కేంద్రంలో వచ్చే నెల రెండో తారీఖున జరగబోతున్న ఎన్నికల పోరులో ఎన్నికల ప్రచారాలు ఊపందుకున్నాయి అయితే హుకుంపేటలో 15 వార్డులు ఉండగా ఐదో వార్డ్ మెంబర్ గా ఆకుపాటి భాస్కర్ కుక్కర్ గుర్తుపై పోటీ చేస్తున్నానని విస్తృత ప్రచారం నిర్వహించారు ఆయన విలేకరుగా దశాబ్ద కాలంగా పనిచేస్తున్నారు . అయితే ఆయనకు పంచాయతీలోనే కాదు అధికారుల దగ్గర కూడా మంచి పేరు గుర్తింపు ఉండడం విశేషం ప్రజలు అతన్ని గుర్తించి ఓటేస్తే పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానంటూ ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఐదో వార్డ్ ప్రజలే కాకుండా హుకుంపేట 15 వార్డుల ప్రజలు కూడా ఆకుపాటి భాస్కర్ కు మద్దతు తెలుపుతున్నారని ఆయన అన్నారు ఈ ప్రచారంలో ఆయనతోపాటు హుకుంపేట 15 వార్డుల ప్రజలు కూడా పాల్గొన్నారు.

వంతెన కట్టలేని పాలకులకు ఓట్లు ఎందుకు..?

- శిరగం తోకవలస గిరిజనుల సమరశంఖం!



అరకులోయ, పెన్ పవర్ నవంబర్ 27:దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడుస్తున్నా.. శిరగం తోకవలస గ్రామ గిరిజనులకు మాత్రం కనీస రవాణా సౌకర్యం కరువైంది. అభివృద్ధి మాటలు వింటున్నారే తప్ప.. తమ గ్రామానికి వాగుపై కనీసం ఒక వంతెన కూడా నిర్మించలేని పాలకుల తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్ల కోసం గడప తొక్కే నాయకులు.. గెలిచిన తర్వాత తమ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని మండిపడుతున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే బతుకుపై భయం!

గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా స్తంభిస్తున్నాయి. వాగు ఉధృతంగా ప్రవహిస్తే గ్రామస్తులు బయటకు వెళ్లలేని పరిస్థితి. గర్భిణులకు ప్రసవ వేదనలు వచ్చినా, అనారోగ్యంతో అత్యవసర వైద్యం అవసరమైనా ఆసుపత్రికి చేరుకోవడం కష్టంగా మారుతోంది. అంబులెన్స్ సైతం వాగు అవతలే నిలిచిపోయే దుస్థితి నెలకొంది. ప్రాణాపాయ పరిస్థితుల్లో తమను ఆదుకునేదెవరని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం!

సుమారు 50 గిరిజన కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామానికి వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజా పరిష్కార వేదికలోనూ ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని వాపోతున్నారు.

ఓట్ల కోసం వస్తే నిలదీస్తాం.. వంతెన కట్టేవరకు ఓటు వేయం!

ఎన్నికల సమయంలో హామీలతో వచ్చే నాయకులకు ఈసారి తమ ఓట్లతో సమాధానం చెబుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ముందుగా వంతెన నిర్మాణానికి హామీ కాదు.. కార్యాచరణ చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. వంతెన నిర్మించకుండా ఓట్లు అడగడానికి గ్రామంలోకి రావద్దని స్పష్టం చేస్తున్నారు.ఈసారి పంచాయతీ ఎన్నికలతో పాటు వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ఏ ఎన్నికల్లోనూ ఓటు వేయబోమని హెచ్చరిస్తున్నారు. మాకు రాజకీయ హామీలు వద్దు.. మా ప్రాణాలకు భరోసా ఇచ్చే వంతెన కావాలి! అంటూ శిరగం తోకవలస గ్రామస్తులు తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి వంతెన నిర్మాణం చేపట్టాలని, 50 గిరిజన కుటుంబాల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుల ఘన విజయం.

కురుపాం నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం. అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కురుపాం ఎమ్మెల్యే పిలుపు.



గుమ్మలక్ష్మీపురం నవంబర్ 27 పెన్ పవర్.కురుపాం నియోజకవర్గ పరిధిలో ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు గణనీయ సంఖ్యలో విజయం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజేతలు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులతో సందడిగా మారింది.వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నూతన ప్రజాప్రతినిధులతో కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి,ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులను పేరు పేరునా అభినందించి,శుభాకాంక్షలు తెలియజేశారు.విజేతలను ఆప్యాయంగా పలకరించి వారి విజయాన్ని అభినందించారు.అనంతరం పార్టీ శ్రేణులు మిఠాయిలు పంచుకుంటూ,విజయోత్సాహాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రజలు ఇచ్చిన ఈ విజయాన్ని బాధ్యతగా భావించి,తమపై నమ్మకంతో గెలిపించిన ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన,తాగునీరు,రహదారులు,పారిశుధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ నాయకులు,నూతన ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని,ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ప్రజలు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీకి, కురుపాం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని విజేతలకు ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన నూతన ప్రజాప్రతినిధులు,టీడీపీ నాయకులు,కూటమి శ్రేణులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్వెల్ నగర్‌లో విషాదం..చలపతి మృతి

- చలపతి పార్థివ దేహానికి నివాళులర్పించిన కార్పొరేటర్
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన శ్యామ్ సుధాకర్



విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27 : విశాఖ నగరంలోని 73వ వార్డు కార్వెల్ నగర్‌కు చెందిన నివాసి చలపతి ఈరోజు మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మృతి వార్త తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ పెతకంశెట్టి శ్యామ్ సుధాకర్ వెంటనే స్పందించి, చలపతి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చలపతి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో భాగస్వాములయ్యారు. ప్రియమైన వ్యక్తిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెబుతూ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని, ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, వార్డు ప్రజలకు అండగా ఉంటున్న కార్పొరేటర్ శ్యామ్ సుధాకర్, చలపతి కుటుంబాన్ని పరామర్శించడం స్థానికులలో సానుభూతిని కలిగించింది.

14 వ వార్డులో కార్పొరేటర్ పర్యటన - గుర్తించిన సమస్యలు పరిష్కరిస్తాం :కార్పొరేటర్ గంగరాజు హామీ

- అప్పర.డ్రైవర్స్ కాలనీలో 'ఫ్రైడే డ్రై డే' - డెంగ్యూ, మలేరియాపై ప్రజలకు అవగాహన



విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబర్ 27:విశాఖ తూర్పు నియోజకవర్గం 14వ వార్డు అప్పర కాలనీ, డ్రైవర్స్ కాలనీ ప్రాంతంలో వార్డు కార్పొరేటర్ కాకి గంగరాజు శుక్రవారం పర్యటించారు.ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని,సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.వాటర్ ట్యాంక్‌లు, ఖాళీ సీసాలు,మొక్కల కుండీలు, ఇంట్లో వాడే ఫ్రిజ్ వెనుక భాగంలోని బాక్సులో నిల్వ ఉండే నీటిలో దోమలు పెరుగుతాయని తెలిపారు. వారంలో ఒకసారి వీటన్నింటినీ శుభ్రం చేసుకుని మలేరియా,డెంగ్యూ వ్యాధుల నుంచి సురక్షితంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, అప్పర కాలనీ అధ్యక్షుడు బోధ లక్ష్మణరావు,సీత,అప్పర కాలనీ, డ్రైవర్స్ కాలనీ సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారి దారకొండ విజేతలకు గిడ్డి ఈశ్వరి ఘన సన్మానం

సర్పంచ్ గుంట ఆనందరావు, వైస్ సర్పంచ్ చిలకల సత్యవతికి అభినందనలు



గూడెంకొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 27:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం అమ్మవారి దారకొండ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా తెలుగుదేశం పార్టీ మద్దతుతో విజయం సాధించిన గుంట ఆనందరావును, వైస్ సర్పంచ్‌గా ఎన్నికైన చిలకల సత్యవతిని పాడేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన ఇరువురికి అభినందనలు తెలియజేసి, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమం విజయంతో పాటు ప్రజాసేవ పట్ల బాధ్యతను గుర్తు చేసేలా సాగింది.

వీఐఐటీలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన సదస్సు



-మాదకద్రవ్యాలపై పోరులో యువత పాత్ర కీలకం

గాజువాక :పెన్ పవర్ ,నవంబర్ 27 మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా సమాజానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని, వాటికి దూరంగా ఉంటూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈగిల్ విభాగం విశాఖపట్నం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ పి. కల్యాణి పిలుపునిచ్చారు. విశాఖపట్నం దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లో శుక్రవారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొన్నారు.'సే నో టు డ్రగ్స్-యెస్ టు లైఫ్' నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక అనర్థాలను డాక్టర్ కల్యాణి వివరించారు. డ్రగ్స్‌కు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొంటే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలను తెలియజేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆత్మనియంత్రణతో వ్యవహరించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ఘటనలు గుర్తించినప్పుడు మౌనంగా ఉండకుండా బాధ్యతాయుతంగా స్పందించాలని, వ్యసనాల బారినపడిన వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.కళాశాల ఈగిల్ యాంటీ నార్కోటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈగిల్ విభాగం సహకారంతో స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ , కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్--సైబర్ సెక్యూరిటీ విభాగాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించడం, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునేలా చైతన్యపరచడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం కార్యక్రమ లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్, రెక్టర్ ప్రొఫెసర్ వి. మధుసూదనరావు, డీన్--స్టూడెంట్ అఫైర్స్ సీహెచ్. శివరామకృష్ణ, సీఎస్ఈ--సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డాక్టర్ కె. రోహిత్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మనియంత్రణతో ముందుకు సాగుతూ మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతను పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో 205 మంది విద్యార్థులు, 14 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అసోసియేట్ డీన్--స్టూడెంట్ అఫైర్స్, ఈఈఈ విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. శ్రావంతి, ఈగిల్ క్లబ్ కోఆర్డినేటర్, ఎంసీఏ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. వెంకటేష్ బాబు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎంచుకోవాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు .

ఓటమితో నిరాశ వద్దు.. ప్రజల్లోనే ఉండండి: ఎంపీపీ లీలా ప్రసాద్



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 27:మొండిగెడ్డ సర్పంచ్ ఎన్నికలో వైసీపీ బలపరిచిన అభ్యర్థి అడపా ప్రియాంక కేవలం 16 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ పూజారి లీలా ప్రసాద్‌తో పాటు పలువురు వైసీపీ నాయకులు మొండిగెడ్డలో ప్రియాంకను కలిసి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎంపీపీ పూజారి లీలా ప్రసాద్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజా తీర్పును గౌరవిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఓటమిని గుణపాఠంగా తీసుకుని, పదవి లేకపోయినా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవలో ముందుకు సాగాలని ప్రియాంకకు సూచించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అరుణ్, కృపగిరి, సాగిన సింహాచలం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.ం

73వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్పొరేటర్ పర్యటన





- బీసీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీలు.. విద్యార్థుల సమస్యలపై ఆరా
- సచివాలయ, జీవీఎంసీ సిబ్బందితో డోర్ టు డోర్ కార్యక్రమం
- కాలువలు, డ్రైనేజీల శుభ్రత..
- నూతన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు

విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 27: జీవీఎంసీ 73వ వార్డు పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి సత్వర పరిష్కారం చూపించడమే లక్ష్యంగా వార్డు కార్పొరేటర్ పెతకంశెట్టి శ్యామ్ సుధాకర్ విస్తృత పర్యటన చేపట్టారు. ప్రజల సంక్షేమం, విద్యార్థుల అభివృద్ధి, వార్డులో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ ఒకవైపు స్థానిక బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించగా, మరోవైపు సచివాలయ, జీవీఎంసీ సిబ్బందితో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వార్డు పరిధిలోని స్థానిక బీసీ హాస్టల్‌ను కార్పొరేటర్ పెతకంశెట్టి శ్యామ్ సుధాకర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. హాస్టల్‌లోని విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి చదువులు, వసతి పరిస్థితులు, ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. హాస్టల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. భోజనంతో పాటు కోడిగుడ్లు, అరటిపండ్లు, చిక్కీలు వంటి పోషకాహార పదార్థాలు సక్రమంగా అందుతున్నాయా, వాటి నాణ్యత ఎలా ఉందనే విషయాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత జిల్లా పరిషత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని కార్పొరేటర్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, హాస్టల్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. వార్డులోని ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో కార్పొరేటర్ పెతకంశెట్టి శ్యామ్ సుధాకర్ సచివాలయ, జీవీఎంసీ సిబ్బందితో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని వివిధ వీధులు, సందుల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి సందులో కాలువలు, డ్రైనేజీల పరిస్థితిని పరిశీలించారు. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా, ప్రజలకు దుర్వాసన, దోమల సమస్యలు తలెత్తకుండా నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో నూతన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం అవసరమని గుర్తించిన కార్పొరేటర్, ఆయా పనులకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు, లేఖలు సమర్పించాలని అధికారులకు సూచించారు. అవసరమైన అనుమతులు పొందే దిశగా చర్యలు చేపట్టి, పనులు ప్రారంభించేందుకు చొరవ చూపాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆలస్యం జరగకూడదని, వార్డులో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను కార్యాలయాలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గాలు అన్వేషించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలు తెలియజేసే సమస్యలను నమోదు చేసుకుని వాటిని నిర్దేశిత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే వార్డులో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం సేవలందించడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జనసైనికులు, వీర మహిళలు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించారు. 73వ వార్డులో విద్యార్థుల సంక్షేమం, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కార్పొరేటర్ పెతకంశెట్టి శ్యామ్ సుధాకర్ పేర్కొన్నారు.



పెన్షనర్ల సంఘం నూతన కార్యాలయ భవనం ప్రారంభం



- ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి
- కార్యాలయాన్ని గ్రంథాలయంగా తీర్చిదిద్దాలని స్పీకర్ సూచన

నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 27) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యాలయ భవనాన్ని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతకాయల పద్మావతి కలిసి ప్రారంభించారు. ముందుగా వారు శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. ?ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, రెవెన్యూ అధికారుల సహకారంతో పెన్షనర్ల సంఘం కోసం ఐదు సెంట్ల స్థలాన్ని కేటాయించడం జరిగిందని తెలిపారు. నర్సీపట్నం ప్రధాన సెంటర్‌లో ఉన్న అతి ఖరీదైన స్థలాన్ని వారికి కేటాయించామని, ఆ స్థలంలో సంఘం సభ్యులు తమ సొంత నిధులతో చక్కటి భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని కొనియాడారు. ?ఈ నూతన భవనాన్ని ఒక గ్రంథాలయంలా తీర్చిదిద్దాలని, ఇందులో మంచి పుస్తకాలను అందుబాటులో ఉంచితే ఖాళీ సమయంలో సభ్యులు వాటిని చదువుకోవడానికి వీలుంటుందని స్పీకర్ సూచించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తులు కాబట్టి, నర్సీపట్నంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పెన్షనర్ల సంఘం సభ్యులు భాగస్వాములై తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రామారావు, వార్డు కౌన్సిలర్లు, పెన్షనర్ల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


15వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చి దిద్దుతా - కార్పొరేటర్ ఒమ్మి అప్పలరాజు

స్వచ్ఛ సర్వేక్షణ్ లో భాగంగా ఫైడే డ్రై డే - ప్రజలు, అధికారుల సహకారంతో దోమల నిర్మూలనకు చర్యలు

విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబర్ 27:ఫైడే డ్రైడే లో భాగంగా 15 వ వార్డు దుర్గానగర్ లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 15వ వార్డు కార్పొరేటర్ ఒమ్మి అప్పలరాజు పాల్గొన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పారిశుద్ధ్యంపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నివారణ చర్యలు తీసుకోవాలని మలేరియా సిబ్బందికి సూచించారు.రానున్న రోజుల్లో జీవీఎంసీ 120 వార్డులలో 15 వ వార్డును ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దుతానని,దానికి ప్రజలు, అధికారుల సహకారం పూర్తిగా కావాలన్నారు.మలేరియా విభాగం నిర్వహించిన దోమలు ఏ విధంగా వృద్ధి చెందుతాయి, దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రజలు తిలకించారు.ఈ కార్యక్రమంలో తూర్పు మెడికల్ ఆఫీసర్ ప్రసాదరావు, జోన్ మలేరియా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు,15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్, క్లస్టర్ ఇన్‌చార్జి గాడి సత్యం, మలేరియా సూపర్‌వైజర్ జగదీశ్వరి, టీడీపీ నాయకులు రవి, బాల శంకరరావు, రామకృష్ణ,దేముళ్లు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు, మలేరియా సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులు గమనించాలి విమ్స్ ప్రాంగణ రోడ్డు ప్రత్యామ్నాయ రోడ్డు కాదు : డైరెక్టర్ డాక్టర్ వి మన్మధరావు



అతివేగంతో వచ్చే వాహనాలతో రోగులకు ప్రమాదం - సాధారణ ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

విశాఖపట్నం,పెన్ పవర్, నవంబర్ 27:అరిలోవ నుంచి డైరీఫామ్ వైపు వెళ్లేవారికి వీమ్స్ లోపలి రోడ్డు ప్రత్యామ్నాయ రోడ్డు కాదని విమ్స్ డైరెక్టర్ డా. మన్మధరావు ఒక ప్రకటనలో తెలిపారు.వీమ్స్ లోపలి రోడ్డు విశాలంగా ఉండటం వల్ల ద్విచక్ర వాహనాలు, ఆటోలు అతివేగంగా వస్తున్నాయని, దీనివల్ల రోగులు, రోగుల సహాయకులు, న్యూరో వ్యాధిగ్రస్తులు, నెమ్మదిగా నడిచే రోగులకు రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.ఆసుపత్రికి వచ్చేవారు కాకుండా, ప్రధాన రహదారి రద్దీగా ఉందంటూ వీమ్స్ రోడ్డును ప్రత్యామ్నాయంగా వాడటం వల్ల రోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మరోపక్క డైరీఫామ్ జంక్షన్ నుంచి అడ్డదారిలో, ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా వీమ్స్ ప్రధాన మార్గం ద్వారా రెండో గేటు నుంచి ప్రవేశించి, మళ్లీ వ్యతిరేక దిశలో అరిలోవ వైపు వెళుతున్నారన్నారు. దీనివల్ల వీమ్స్ రోడ్డును హైవే రోడ్డుకు ప్రత్యామ్నాయంగా వాడుతున్నట్లు తెలుస్తోందన్నారు.ఇదే రోడ్డులో రోగులు, రోగుల సహాయకుల కోసం ఉచితంగా బ్యాటరీ కార్లు, అంబులెన్సులు తిరుగుతూ ఉంటాయన్నారు. అందుకే వీమ్స్ ప్రతి గేటు వద్ద సెక్యూరిటీ గార్డులు ఉండి నియంత్రణ చేస్తున్నారన్నారు. రోగులు, వారి సహాయకుల వాహనాలకు, వైద్య సిబ్బంది వాహనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సెక్యూరిటీ గార్డులు చూస్తున్నారన్నారు. అదే విధంగా ఆసుపత్రికి సంబంధం లేకుండా వచ్చి పోయే వాహనదారులకు వీమ్స్ రోడ్డు ప్రత్యామ్నాయ రోడ్డు కాదని తెలియజేస్తున్నారన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని,విమ్స్ రోడ్డులోకి సాధారణ ట్రాఫిక్ రాకుండా తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని వీమ్స్ సంస్థ తరఫున డైరెక్టర్ కోరారు.

అభివృద్ధి చేసి ఓటు అడుగుతున్నాం... ఆదరించండి

రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్

నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 27):ఎనర్సీపట్నం నియోజకవర్గంలో గత రెండున్నర సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పుస్తక రూపంలో ప్రజల ముందుకు తీసుకెళ్లామని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ తెలిపారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సీపట్నం మండలం కొత్త లక్ష్మీపురం, నగరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో విజయ్ మాట్లాడుతూ, నిజాయితీగా పనిచేశాం కాబట్టే ప్రజల మధ్య ధైర్యంగా నిలబడి పనులు చేశామని చెప్పుకోగలుగుతున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సహకారంతో నర్సీపట్నంలో ?532.75 కోట్లతో 1,896 అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్షేమ పథకాల ద్వారా



కూడా ?568 కోట్లు తీసుకొచ్చామని వివరించారు. ఎన్టీఆర్ ఆసుపత్రి పడకలను 100 నుంచి 150కి పెంచడం, అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ కళాశాల, ఎన్టీఆర్ స్టేడియం వంటి పనులను ఆయన ప్రస్తావించారు. పంచాయతీలకు సుమారు ?1.04 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చామని తెలిపారు. నగరంలో శ్మశాన వాటిక, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, నిండుకొండ వంతెన అసంపూర్తి పనులు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేఎల్ పురం పంచాయతీ ఎన్నికల ప్రచారంలో గెడ్డం అచ్చియమ్మ గారికి మద్దతుగా నిలిచారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నాయకులుగా ఎదిగే అవకాశం వచ్చిందని, వారందరికీ అండగా నిలబడతామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో పాల్గొనే అవకాశం రాజ్యసభ సభ్యుడిగా తనకు రావడం సంతోషంగా ఉందని, తెలుగుదేశం పార్టీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసి ముందుకు సాగిందని పేర్కొన్నారు. ?రాజ్యాంగబద్ధంగా నిధులు విడుదల కావాలంటే పంచాయతీ ఎన్నికలు సక్రమంగా జరగాలని, తెలుగుదేశం పార్టీ, ఎన్డీయే బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. గ్రామానికి చేరుకున్న చింతకాయల విజయ్‌కు మహిళలు హారతులు, పూలతో ఘన స్వాగతం పలికారు.

ద్రాక్షారామంలో కూటమి అభ్యర్థుల ఇంటింటా ప్రచారం



రామచంద్రపురం రూరల్, పెన్ పవర్, నవంబర్ 27: గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ద్రాక్షారామంలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామ సర్పంచ్ అభ్యర్థి యండమూరి ఈశ్వరరావు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గొల్లపల్లి అమూల్య, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఎంపీపీ డాక్టర్ మడకా రాంబాబు, మాగాపు అమ్మిరాజు, శాఖాబాబి తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ప్రజలను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు కూటమిపై నమ్మకంతో మద్దతు తెలిపారని, అదే ఆదరణ గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గొల్లపల్లి అమూల్య మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి విజయప్రస్థానం కొనసాగుతుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పాత్ర కీలకమని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో కూటమి సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జులూరు మండలంలో 73 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు

కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 27: కాజులూరు మండల పరిధిలో జరగనున్న గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎన్నికల సిబ్బంది కోసం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రక్రియలో మొత్తం 73 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీవో జె. రాంబాబు తెలిపారు. గ్రామాల వారీగా పోలైన ఓట్లు ఆర్యవటంలో 10, చేదువాడలో 1, దుగ్గుదుర్రులో 8, గొల్లపాలెంలో 7, జగన్నాధగిరిలో 4, కాజులూరులో 9, కోలంకలో 4, మంజేరులో 2, నామవానిపాలెంలో 1, పల్లిపాలెంలో 13, పెనుమళ్లలో 1, శీలలో 3, శలపాకలో 2, తణుకువాడలో 4, తణుమళ్లలో 2, తర్లంపూడిలో 1, తిప్పరాజుపాలెంలో 1 ఓటు పోలయ్యాయి. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పించడంతో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా పూర్తయిందని ఎంపీడీవో వెల్లడించారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆదిత్య కళాశాల విద్యార్థుల ఎంపిక



కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 27: ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు అంతర్ కళాశాలలు, యూనివర్సిటీ స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. బీసీఏ డేటా సైన్స్ చదువుతున్న కోసెట్టి ప్రవీణ్ రాజ్ ఫెన్సింగ్‌లో, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్న టి. మౌర్య చంద్ర ఫుట్‌బాల్‌లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. యూనివర్సిటీ ఆఫ్ జమ్మూలో డిసెంబర్ 4 నుంచి 12 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రవీణ్ రాజ్, కేరళలోని కన్నూర్ యూనివర్సిటీలో డిసెంబర్ 19 నుంచి 24 వరకు జరగనున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మౌర్య చంద్ర పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి. ఈ. వి. ఎల్. నాయుడు విద్యార్థులను అభినందిస్తూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంపై ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ అందించిన అధ్యాపకులు, క్రీడా విభాగాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లపై ఎంపీడీఓ క్షేత్రస్థాయి పరిశీలన

- పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహించాలి: ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 27: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు సంబంధిత అధికారులకు సూచించారు.ఆత్రేయపురం మండల పరిధిలోని వాడపల్లి, ర్యాలి, మెర్లపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి కేంద్రాల్లో కల్పించిన మౌలిక సదుపాయాలు, అధికారులకు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, కౌంటింగ్ ప్రక్రియకు చేపట్టిన ఏర్పాట్లను నిశితంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కౌంటింగ్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను అత్యంత అప్రమత్తతతో, సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి గందరగోళం, అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఎన్నికల ఫలితాల వెల్లడిలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రతి దశలోనూ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలతో పాటు సిబ్బందికి అవసరమైన సౌకర్యాల విషయంలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని సూచించారు.మండలంలోని అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు స్పష్టం చేశారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతా - సర్పంచ్ అభ్యర్థి మంగం సుబ్రహ్మణ్యం



పిఠాపురం, పెన్ పవర్, నవంబర్ 27 : చిన్నజగ్గంపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న మంగం సుబ్రహ్మణ్యం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచారం ఆఖరి రోజు సందర్భంగా చిన్నజగ్గంపేటలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న మంగం సుబ్రహ్మణ్యం ప్రచారంలో బుల్లితెర నటుడు బాబీ (జబర్దస్త్ బాబీ), బుల్లితెర మరియు వెండితెర నటీమణి అరుణా చౌదరీ, బుల్లితెర మరియు వెండితెర నటీమణి దివ్యశ్రీ పాల్గొని మద్దతు తెలుపుతూ గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్ళి ఓటర్లను ఉంగరం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. తనని సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామ ప్రజలందరికీ స్వచ్ఛమైన మినరల్ వాటర్ను ఉచితంగా అందించడం, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో కళ్యాణ మండపం మరియు ఆధునిక ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టడం, గ్రామంలో ఉన్న ఆలయాలకు, చర్చిలకు ప్రతి సంవత్సరం రూ. 20 వేల తన సొంత నిధులు ఇస్తాను అన్నారు. అదే విధంగా గ్రామ ప్రజలకు వైఫై ఇంటర్నెట్ సౌకర్యం మరియు డిజిటల్ సేవలు ఏర్పాటు చేస్తానని, గ్రామ యువతకు ఆటస్థలాల ఏర్పాటు మరియు క్రీడా సామగ్రి పంపిణీకి తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామస్థుల వైద్య అవసరాల కోసం నిరంతరం అందుబాటులో ఉండే ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి యువతకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు మరియు ఉద్యోగ కల్పనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తానని, ఆటో స్టాండ్లు, విశ్రాంతి షెడ్లు ఏర్పాటు మరియు డ్రైవర్ల సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చిరు వ్యాపారులకు ఆర్థిక సదుపాయం మరియు మార్కెట్ రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. అన్నదాతలకు విత్తనాలు, ఎరువుల సకాల సరఫరా మరియు గిట్టుబాటు ధర అందేలా తన వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ సేవలు, ఒకే చోట సులభంగా పొందేలా మీ సేవ కేంద్రం ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు సకల సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటాను అని ఆయన అన్నారు. 29వ తేదీన జరిగే ఎన్నికల్లో ఉంగరం గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి చిన్నజగ్గంపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించాలని కోరారు.

జగ్గంపేటలో పూలే విగ్రహాలకు షెడ్డు ఏర్పాటు



జగ్గంపేట, పెన్ పవర్, నవంబరు 27: జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(హైస్కూల్) ద్వారం వద్ద ఉన్న సావిత్రిబాయి పూలే, జ్యోతిరావుపూలే విగ్రహాలకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టీవీఎస్ రంగారావు షెడ్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ గతంలో విగ్రహాలు ఉన్నప్పటికీ పైకప్పు లేకపోవడంతో ఎండలో ఎండి, వానలో తడుస్తూ ఉండేవి. దీంతో విగ్రహాలు దెబ్బతినే ప్రమాదముండడంతో ప్రధానోపాధ్యాయులు రంగారావు తన సొంత నిధులతో షెడ్డు సమకూర్చి నిర్మాణ పనులు చేపట్టారు.

మర్రెడ్డితోనే మార్పు సాధ్యమా..!? పిఠాపురం జనసేనలో అంతర్గత చర్చ!



కాకినాడ ప్రత్యేక ప్రతినిధి (పిఠాపురం), పెన్ పవర్, నవంబర్ 27 : రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకమైన పిఠాపురం నియోజకవర్గ జనసేన శ్రేణుల్లో ఇప్పుడు ఒకటే చర్చ నడుస్తోంది. పార్టీ ఆవిర్భావం నుండి క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసిన మర్రెడ్డి శ్రీనివాస్‌కు తిరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని పార్టీ మొదటి నుండి ఉన్న జనసైనికులు బలంగా కోరుకుంటున్నారు.

అందరితో సమన్వయంగా ఉన్న మర్రెడ్డి

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుండి పిఠాపురంలో జనసేన జెండాను మోసిన నాయకుడిగా మర్రెడ్డి శ్రీనివాస్‌కి పేరుందని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. గ్రామస్థాయి కార్యకర్తల నుండి నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు అందరినీ కలుపుకొని వెళ్లే తత్వం ఆయన సొంతమని, ఏ వర్గాన్ని నొప్పించకుండా సమన్వయంతో పనిచేయడం వల్లే గతంలో పార్టీ బలోపేతమైందని స్థానిక క్యాడర్ విశ్లేషిస్తోంది.

ఇటు ప్రజలకు అటు నాయకులకు అందుబాటులో ఉన్న వ్యక్తి

సామాన్య ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా, కార్యకర్తలకు ఏ అవసరం ఉన్నా నేరుగా ఫోన్ చేసి మాట్లాడే వెసులుబాటు మర్రెడ్డి శ్రీనివాస్ వద్ద ఉండేదని జనసైనికులు గుర్తు చేసుకుంటున్నారు. పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ రాష్ట్ర పాలనలో నిమగ్నమై ఉన్న సమయంలో, స్థానికంగా ప్రజలకు మరియు అధిష్టానానికి మధ్య వారధిగా నిలబడగల సామర్థ్యం ఆయనకు ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఫైవ్ మ్యాన్ కమిటీ తర్వాత మారిన సమీకరణాలు

మర్రెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుండి తప్పించి, 'ఫైవ్ మ్యాన్ కమిటీ' (ఐదుగురు సభ్యుల కమిటీ) ఏర్పాటు చేసినప్పటి నుండి పార్టీలో అంతర్గత విభేదాలు మొదలయ్యాయని పాత క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. మరోవైపు, సీనియర్ నేతలు మరియు వివిధ సామాజిక వర్గాల ప్రాతినిధ్యం కోసం అధిష్టానం ఈ కమిటీ వ్యవస్థను తెచ్చిందని పార్టీ వర్గాలు భావిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని, ఎవరికి చెప్పుకోవాలో తెలియక కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జనసేనకు పూర్వవైభవం రావాలంటే..

నియోజకవర్గంలో పార్టీ మళ్లీ పూర్తిస్థాయి ఉత్సాహంతో పనిచేయాలంటే ఏకనాయకత్వం అవసరమని పాత తరం జనసైనికులు అంటున్నారు. మర్రెడ్డి శ్రీనివాస్‌కి తిరిగి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తేనే కార్యకర్తల్లో మళ్లీ జోష్ వస్తుందని, పార్టీకి పూర్వవైభవం దక్కుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి క్షేత్రస్థాయి నుండి వస్తున్న ఈ డిమాండ్లపై పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి...! అయితే ఇప్పటికే మర్రెడ్డి శ్రీనివాస్‌తో జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదల పవన్ కళ్యాణ్ ఫోన్ లో మంతనాలు జరిపినట్లు విశ్వసనీయ సమాచారం.

చిరునవ్వు చిరకాలం నిలవాలంటే రోజుకోసారి ఫ్లాసింగ్ తప్పనిసరి : డా అడ్డాల



కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 27 : నగరంలోని స్థానిక ఆడబాల ట్రస్ట్ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు డా అడ్డాల సత్యనారాయణ చే ఫ్లాసింగ్ యొక్క ఉపయోగం, వాడే పద్ధతిని వివరించారు. ఈ సందర్భంగా డా అడ్డాల మాట్లాడుతూ నేషనల్ ఫ్లాసింగ్ డే ప్రతి సంవత్సరం నవంబర్‌లోని నాలుగవ శుక్రవారం జరుపుకుంటారని, ఈ రోజు దంతాల మరియు చిగుళ్ల ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి, రోజువారీ ఫ్లాసింగ్ అలవాటును ప్రోత్సహించడానికి అంకితం చేశారని, కేవలం బ్రష్ చేయడం వల్ల పళ్ళ మధ్య సందుల్లో ఇరుక్కున్న ఆహార కణాలు, ఫలకం పూర్తిగా తొలగిపోవని, ఫ్లాసింగ్ వల్ల దంతక్షయం, చిగుళ్ల వ్యాధులు, నోటి దుర్వాసన వంటి సమస్యలను నివారించవచ్చని, వ్యాక్స్‌డ్ ఫ్లాస్ వాడటం వల్ల పళ్ళ మధ్య సందులు ఇరుకుగా ఉన్నప్పుడు లేదా బ్రేసెస్ ఉన్నప్పుడు సులభంగా శుభ్రం అవుతుందని అన్నారు. రోజువారీ దంత సంరక్షణలో బ్రషింగ్‌తో పాటు ఫ్లాసింగ్ చేయడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలున్నాయని, బ్రష్ చేరలేని పళ్ళ మధ్య సందుల్లో పేరుకుపోయే బ్యాక్టీరియా పొరను ఫ్లాసింగ్ తొలగిస్తుందని, పళ్ళ మధ్య ఇరుక్కున్న ఆహార కణాలను, చక్కెర నిల్వలను శుభ్రం చేయడం ద్వారా దంతాలు పుచ్చిపోయే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, చిగుళ్ల అంచున పేరుకునే బ్యాక్టీరియాను తొలగించి, చిగుళ్ల వాపు మరియు తీవ్రమైన పెరియోడాంటైటిస్ వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుందని, పళ్ళ మధ్య కుళ్ళిపోయే ఆహార వ్యర్థాల వల్ల కలిగే దుర్వాసనను అరికట్టి, శ్వాసను తాజాగా ఉంచుతుందని, నోటిలోని బ్యాక్టీరియా రక్తప్రవాహంలోకి చేరితే గుండె జబ్బులు, మధుమేహం వంటి సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉందని, ఫ్లాసింగ్ ద్వారా నోటిని శుభ్రంగా ఉంచుకోవడం వల్ల శరీర ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని అన్నారు. ఫ్లాసింగ్ సరైన పద్ధతిలో చేయాలంటే, సుమారు 18 అంగుళాల పొడవున్న ఫ్లాస్ దారాన్ని తీసుకుని,రెండు చేతుల మధ్య వేళ్ళకు చుట్టుకుని, మధ్యలో 1--2 అంగుళాల భాగాన్ని శుభ్రం చేయడానికి ఉంచాలని, దారాన్ని పళ్ళ మధ్యకు నెమ్మదిగా, అదుపుగా పంపాలని, చిగుళ్ళపై బలంగా ఒత్తిడి పెట్టవద్దని, దంతం ఆకృతికి తగినట్లు 'జ' ఆకారంలో వంచి, చిగురు అంచు కింద వరకు సున్నితంగా పైకి-కిందికి కదపాలని, ప్రతి కొత్త పంటికి దారం యొక్క శుభ్రమైన భాగాన్ని ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వర రావు, ప్రసాద్ నాయుడు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై గొల్లపాలెంలో అవగాహన ర్యాలీ



కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 27: అంతర్జాతీయ బాల్యవివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ తాళ్లరేవు ప్రాజెక్టు పరిధిలోని కాజులూరు మండలం గొల్లపాలెం సెక్టార్‌లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో వై. శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కె. రమణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గ్రామ ప్రజలతో బాల్యవివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. బాలల హక్కుల పరిరక్షణ, బాలికల భవిష్యత్తుకు భరోసా కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జగపతినగరం పంచాయతీ అభివృద్ధికి ఉంగరం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలి.

-జగపతినగరం చిల్లంగి కిర్లంపూడి గ్రామాల్లో వైసీపీ అభ్యర్థి భారీ ర్యాలీ.
-సర్పంచ్ గా గెలిపిస్తే సేవే లక్ష్యంగా గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి.
-జగపతినగరం గ్రామ సర్పంచి అభ్యర్థి మద్దాల ఆదిలక్ష్మి గణపతి.



కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్,27: జగపతినగరం గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే ఉంగరం గుర్తుపై ఓటు వేసి తమను సర్పంచ్ గా గెలిపించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఇన్చార్జులు, తోట నరసింహం, ముద్రగడ గిరిబాబు, బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని మద్దాల ఆదిలక్ష్మి గణపతి అన్నారు. ఈనెల 29న జరగనున్న పంచాయతీ ఎన్నికల పురస్కరించుకుని శుక్రవారం ప్రచారం ఆఖరి రోజు కావడంతో జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో సర్పంచ్ అభ్యర్థిని మద్దాల ఆదిలక్ష్మి గణపతి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, ఆయా వార్డు సభ్యులు,మద్దతుదారులతో కలసి శుక్రవారం జగపతినగరం,చిల్లంగి, కిర్లంపూడి గ్రామాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దాల ఆదిలక్ష్మి గణపతి మాట్లాడుతూ జగపతినగరం సర్పంచ్ గా ఒక్క అవకాశం ఇస్తే సేవే లక్ష్యంగా నిరంతరం గ్రామ అభివృద్ధికి,ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ పెద్దలు, ప్రజలు సహకారంతో తన వంతు కృషి చేస్తానన్నారు. తమ అమూల్యమైన పవిత్రమైన ఓటు ముద్రను ఉంగరం గుర్తుపై ఓటు వేసి తనను సర్పంచ్ గా గెలిపించడంతోపాటు , పంచాయతీ పరిధిలోని 18 వార్డులోనూ తమ మద్దతుదారులైన వార్డు సభ్యులుగా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో శరకణం భద్రం, ఆడారి బాబ్జి,చల్లా సత్యనారాయణ,కాళ్ళ సత్యనారాయణ, తూము చినబాబు,పెంటకోట శ్రీరాములు, యల్లప్ప నానాజీ,దాడి పెదబుజ్జి, మళ్ల నాగు,లంక మూర్తి, నక్కా అప్పలరాజు,పెనగంటి రాజేష్,మద్దాల శ్రీను, పాముల చంటి, వేగి రామకృష్ణ,చదరం సత్తిబాబు, శరకణం సంతోష్,ఆడారి సుధాకర్,మురా శ్రీను బంగారు వెంకటరమణ, నైదాన బాబ్జి, శరకణం తాతాజీ, పెంటకోట సాయి, కాళ్ళ పొలారావు,అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దాల ఆదిలక్ష్మి గణపతి అభిమానులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని సమాజం కోసం ర్యాలీ



జగ్గంపేట, పెన్ పవర్, నవంబరు 27: అంతర్జాతీయ బాల్య, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జగ్గంపేటలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లకు ముందు పెళ్లి వద్దు చదువే మాకు ముద్దు, చీకటిని తరిమెద్దాం-బాల్య వివాహం ఆపేద్దాం, వెలుగు వెలగాలి- బాల్య వివాహం ఆగాలి అనే నినాదాలతో హోరెత్తించారు. సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహం వలన బాలికల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. బాల్య వివాహాలు జరిగినట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని లేదా 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com